## ఉద్యమకారుల త్యాగాలకు గౌరవం ఎప్పుడు?




తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

## జులూస్-ఎ-ముహమ్మదీ ర్యాలీలో షేక్ మజర్ బాబా..




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 243 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 28 ఆగస్టు 2026


# దేశాభివృద్ధిలో యువత, క్రీడాశక్తి ఎంతో ముఖ్యం

- ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమం
- క్రీడాకారులకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు



**న్యూఢిల్లీ,ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశ యువత, క్రీడాకారులకు ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యువ అలథెట్స్‌తో ప్రధాని మోదీ వర్చువల్‌గా సంభాషించారు. అనంతరం యువతను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలంటే కేవలం మెడల్స్ కాదని.. యువతలో ఉన్న చైతన్యాన్ని మేల్కొలిపే సాధనాలనీ మోదీ చెప్పుకొచ్చారు. ఆటలు యువశక్తిని వెలికితీసా_యన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకు పోవడానికి యువశక్తితో మిగతా2లో...

# మీరాలం చెరువుకు మహార్దశ

- పర్యాటక కేంద్రంగా అభివృద్ధి
- ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణం
- పనులను పరిశీలించిన సిఎం రేవంత్



**హైదరాబాద్,ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ నగరంలోని చారిత్రక ప్రాధాన్యం కలిగిన మిర్ ఆలం చెరువుకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త హంగులు అద్దబోతోంది. కుటుంబ సమేతంగా వచ్చి రోజంతా ప్రకృతి అందాలు, జలక్రీడలు , వినోదాన్ని ఆస్వాదించేలా దీనిని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం మిర్ ఆలం చెరువును అకస్మికంగా పరిశీలించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సుందరీకరణ పనులు , సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణ పురోగతిని అధికారులతో మిగతా2లో...

## యశోదాలో గవర్నర్‌కు సిఎం పరామర్శ



**హైదరాబాద్,ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్):**అనారోగ్యంతో హై టెక్ సిటీ యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను సిఎం రేవంత్ రెడ్డి పరామర్శించారు. ఎంపీ వేం నరేందర్ రెడ్డితో కలసి వెళ్లిన సిఎం గవర్నర్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసారు. ఈ మేరకు గవర్నర్ ఆరోగ్యంపై వైద్యులను ఆరా తీసారు.

## ఎఐసిసి పరిధిలో కొండా సురేఖ వ్యవహారం

- అధిష్టానం తీసుకునే నిర్ణయం అందరికీ శిరోధార్యం
- కాంగ్రెస్‌లో వ్యక్తిగత కోపాలకు తావు లేదన్న మహేశ్ గౌడ్



**నిజామాబాద్,ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** మంత్రి కొండా సురేఖ అంశం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారాన్ని రేపుతున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కూతురు సుస్మిత తీవ్ర వ్యాఖ్యలు చేయడం.. దీనిపై సురేఖకు క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇవ్వగా.. కుమార్తె కామెంట్స్‌కు తనను బాధ్యురాలిని చేయొద్దంటూ మంత్రి వివరణ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా, ఈ వ్యవహారంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. కొండా సురేఖ ఎపిసోడ్ ఏఐసీసీ పరిధిలో ఉందన్నారు. క్రమశిక్షణ మిగతా2లో...

## 1,600 మంది గల్లంతు



**నేపాల్,ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** నేపాల్-టిబెట్ సరహద్దుల వెంబడి సంభవించిన మెరుపు వరదల బీభత్సంలో 288 మంది భారతీయులు గల్లంతయ్యారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) ప్రకటించింది. మరో 200 మంది భారతీయ పౌరులు చైనా వైపు టిబెట్‌లో చిక్కుకుపోయినట్టు తెలిపింది. వారికి సహాయం అందించేందుకు రెండు దేశాల అధికారులతో భారత్ నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్టు పేర్కొంది. నేపాల్‌లో సహాయక చర్యలు వేగం పుంజుకున్న నేపథ్యంలో సంక్షోభాన్ని అధిగమించేందుకు ఆ దేశానికి భారత్ భుజం భుజం కలిగి అండగా మిగతా2లో...

## బిఆర్ఎస్ హస్తగతానికి హరీష్‌రావు కుట్ర: కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్,ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్):**బిఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునేందుకు ఆ పార్టీ నేత హరీష్ రావు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. ఇందుకోసం తెరవెనుక కుట్రలు చేస్తున్నాడని విమర్శించారు. ఇటీవలే మెదక్ జిల్లా ఎంఎల్ఎలతో హరీష్ రహస్య మంతనాలు నిర్వహించారని, ఆ సమావేశంలో ఉన్న ఒకరు తనకు ఈ విషయాలు చెప్పారని అన్నారు. కెసిఆర్ వారసత్వం కెటిఆర్‌కు రావద్దని ఆ సమావేశంలో మిగతా2లో...



## కాంగ్రెస్‌కు ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి: హరీశ్‌రావు

**హనుమకొండ,ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** పాలిటెక్నిక్ విద్యార్థుల పట్ల ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. హనుమకొండలో పాలిటెక్నిక్ విద్యార్థులు ఆయనను కలిసి తమ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా మిగతా2లో...

## యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు

- మరో 25 ఏళ్లపాటు ఇలాగే కొనసాగాలి
- ప్రస్తుత సీట్లకు అనుగుణంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు
- ప్రధాని మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ
- తక్షణం అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్



**న్యూఢిల్లీ,ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** లోక్‌సభ నియోజకవర్గాలను యధావిధిగా కొనసాగిస్తూ, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అలాగే డిలిమిటేషన్‌పై వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేసి, మీరు ఏమనుకుంటున్నారో చర్చించాలని కూడా అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543 మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో డీలిమిటేషన్‌కు సంబంధించిన సవరించిన మిగతా2లో...

## ఎలక్ట్రిక్ ఆటోలకు రూ. లక్షన్నర సబ్సిడీ



**హైదరాబాద్,ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్):**రాష్ట్రాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు రవాణా రంగంలో కాంగ్రెస్ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా హైదరాబాద్ కోర్ అర్బన్ పరిధిలో వాయు, శబ్ద కాలుష్యాలను తగ్గించడంతో పాటు ఆటో డ్రైవర్లపై ఇంధన భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా 'తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్- 2026'ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు తాజాగా ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ పథకం ద్వారా తొలి విడతలో భాగంగా 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియ కోసం ప్రభుత్వం రూ.200 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించింది. హైదరాబాద్‌లోని కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని(ఓఆర్ఆర్ లోపు) పాత పెట్రోల్, డీజిల్ ఆటో డ్రైవర్లకు ఈ పథకం వర్తిస్తుంది. మిగతా2లో...

## ఈషా ఫౌండేషన్‌లో విషాద ఛాయలు

- 80 మంది సంస్థ యాత్రికులు వరదల్లో గల్లంతు
- కన్నీటి పర్యంతం అయిన జగ్గీవాసుదేవ్



# మీరాలం చెరువుకు మహర్దశ

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షించిన సీఎం, పనులన్నింటినీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి పనులు శరవేగంగా సాగుతున్నాయి. లక్ష్యంగా పెట్టుకున్న 544 పైల్స్‌లో 273 (50.18 శాతం) పైల్స్ పూర్తి కాగా, 62 పైల్ క్యాప్స్‌లో 28 (45.16 శాతం) పనులు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. చెరువు పునరుజ్జీవనం, చెరువు పరిసర ప్రాంతాలు , ఐలాండ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా చెరువులోకి ఎలాంటి మురుగు నీరు చేరకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని, వర్షపు నీరు మూసీ నదిలోకి సాఫీగా వెళ్లేలా నాలాలను విస్తరించి నీటి నాణ్యతను పెంచాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

యువతతో పాటు కుటుంబాలను ఆకట్టుకునేలా మిర్ ఆలం చెరువులో బోటింగ్, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ కార్యకలాపాలను అందుబాటులోకి తేనున్నారు. పర్యావరణ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా చెరువు చుట్టూ ఫుడ్‌కోర్టులు, పచ్చని పార్కులు, చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు , వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు కానున్నాయి. అంతేకాకుండా, చెరువులో ఉన్న ఐలాండ్లను ప్రకృతి ఆధారిత విశ్రాంతి కేంద్రాలుగా, టెంట్లు వేసుకునే గ్లాంపింగ్ స్పాట్లుగా , డెస్టినేషన్ వెడ్డింగ్స్, ఈవెంట్లకు అనుకూలమైన వేదికలుగా రూపుదిద్దనున్నారు. ఈ నాణ్యమైన సౌకర్యాల కోసం పిపిపి విధానంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి స్థానికులకు ఉపాధి కల్పిస్తారు. సమీపంలోనే ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కుతో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధిని సమగ్రంగా అనుసంధానించాలని సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. దీనివల్ల జూ పార్క్ సందర్శనకు వచ్చే పర్యాటకులు ఒకే పర్యటనలో చెరువు అందాలు, జలక్రీడలు , కుటుంబ వినోదాన్ని పొందగలుగుతారు. విమానాశ్రయానికి సమీపంలో ఉండే ఈ చారిత్రక ప్రాంతం అభివృద్ధి చెందితే, హైదరాబాద్ నగరవాసులతో పాటు దేశ, విదేశీ పర్యాటకులకు మిర్ ఆలం ట్యాంక్ ఒక ప్రధాన పర్యాటక గమ్యస్థానంగా మారనుంది.

# ఘనంగా మాచారెడ్డి పీఏసిఎస్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం

- రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్



**హైదరాబాద్,ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** మాచారెడ్డి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్‌గా నౌసిలాల్ నాయక్ తోపాటు పాలకవర్గ సభ్యులు పమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ.రైతుల సంక్షేమమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, రైతులకు అవసరమైన రుణాలు, విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సేవలు సకాలంలో అందించడంలో పీఏసిఎస్‌లు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ పలు కీలక కార్యక్రమాలను అమలు చేస్తోందని షబ్బీర్ అలీ తెలిపారు. రైతు భరోసా, పంట రుణమాఫీ, ఉచిత విద్యుత్, సాగునీటి వనరుల అభివృద్ధి, రైతు బీమా వంటి కార్యక్రమాలతో పాటు వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మాచారెడ్డి పీఏసిఎస్ నూతన చైర్మన్ నౌసిలాల్ నాయక్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపిన షబ్బీర్ అలీ రైతులు పాలకవర్గంపై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, రాజకీయాలకు అతీతంగా ప్రతి రైతుకు సమానంగా సేవలు అందించాలని సూచించారు. సంఘంను ఆర్థికంగా బలోపేతం చేస్తూ రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు నూతన పాలకవర్గం సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాచారెడ్డి మాజీ ఎంపీపీ సురేష్ నర్సింగరావు, కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, మాచారెడ్డి సర్పంచ్ సంతోష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బాలరాజు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు రెడ్డి నాయక్, భిక్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, తిప్పాపూర్ సొసైటీ చైర్మన్ భీంరెడ్డి, కామారెడ్డి సొసైటీ చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మారెడ్డి, చుక్కాపూర్ లక్ష్మీనర్సింహ ఆలయ చైర్మన్ కమలాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, కౌన్సిలర్ మోతిలాల్, డీసీసీ ఉపాధ్యక్షులు గంప ప్రసాద్, కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సందీప్, మాజీ సొసైటీ చైర్మన్లు పూల్ చంద్, స్వామిగౌడ్, రాజమౌళి, సత్యనారాయణ, బాలరాజుగౌడ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాజిరెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు, మహిళలు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఎలక్ట్రిక్ ఆటోలకు రూ. లక్షన్నర సబ్సిడీ

(మొదటి పేజీ తరువాయి)

దీని ద్వారా డ్రైవర్ల కోసం రెండు ప్రధాన ఆప్షన్లను అధికారులు అందుబాటులోకి తెచ్చారు.మొదటి ఆప్షన్ కింద ఉన్న పాత ఆటో ఇనుప చట్రం(ఫ్రేమ్)ను అలాగే ఉంచి, పెట్రోల్ లేదా డీజిల్ ఇంజిన్ స్థానంలో ఏఐఎస్ 123 ప్రమాణాలు కలిగిన ఎలక్ట్రిక్ కిట్‌ను (ఫిక్స్‌డ్ లేదా స్వాపింగ్ బ్యాటరీతో) అమర్చుకోవచ్చు. రెండవ ఆప్షన్ కింద పాత ఆటోను స్క్రాప్ చేసి, కొత్త ఎలక్ట్రిక్ ఆటోను కొనుగోలు చేయవచ్చు. ఈ ప్రక్రియ మొత్తాన్ని 16 వారాల ప్రణాళికతో ఆన్‌లైన్ ద్వారా పూర్తి పారదర్శకంగా అమలు చేయనున్నారు. ఇలా కొత్త ఈవీ ఆటోలను కొనుగోలు చేసే డ్రైవర్లకు ప్రభుత్వం రూ.1.5 లక్షల వరకు సబ్సిడీని అందజేయనుంది. ఈ పథకం అమల్లోకి వస్తే ఆటో డ్రైవర్లకు ఇంధన ఖర్చులు పూర్తిగా తగ్గి ఆర్థికంగా భారీ లబ్ది చేకూరనుంది. అలాగే, నగరంలో కాలుష్యం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. త్వరలోనే ఈ ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కానుంది.



# యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు

(మొదటి పేజీ తరువాయి)

బిల్లును మళ్లీ ప్రవేశపెట్టనున్నారనే వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల్లోనూ ఎలాంటి మార్పులు చేయొద్దని సూచించారు. డీలిమిటేషన్ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అత్యంత కీలకమైన విషయమని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల అభిప్రాయాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా విస్తృత రాజకీయ సంప్రదింపులు జరపాలన్నారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చర్చించేందుకు సర్వపక్ష సమావేశం నిర్వహించాలని, రాజకీయ పార్టీలు ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించేందుకు తగిన సమయం ఇవ్వాలని ఆయన కోరారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 ఏప్రిల్ 17వ తేదీన లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించలేక పోయిందని పేర్కొన్నారు. అటువంటి విధానాన్ని మళ్లీ పునరావృతం చేయవద్దని కోరారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ఎలాంటి నిర్ణయానికైనా కాంగ్రెస్, విపక్ష కూట మి మద్దతు ఇవ్వబోదని ఖర్గే తేల్చి చెప్పారు. లోక్‌సభ స్థానాలను పెంచేందుకు కేంద్రం ప్రయత్ని స్తోందని, ఇది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. మహిళలకు చట్టసభల్లో కల్పించే 33 శాతం రిజర్వేషన్లను డీలిమి టేషన్ పక్రియతో ముడిపెట్టడాన్ని ఖర్గే తప్పుపట్టారు. ఈ అంశంపై తాను గతంలో జులై 16న కూడా లేఖ రాశానని, కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పం దన రాకపోవడంతో తాజా పరిణామాల నేపథ్యంలో మోదీకి మళ్లీ లేఖ రాయాల్సి వచ్చిందని ఖర్గే పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌కు ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి: హరీశ్‌రావు

(మొదటి పేజీ తరువాయి)

హరీశ్ మాట్లాడుతూ.. 97 జివోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాన విద్యార్థుల ఉద్యమాలు రాహుల్ గాంధీకి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. జెన్‌జీ ఉద్యమాలపై కాంగ్రెస్‌కు ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి ఏంటని దుయ్యబట్టారు. అంతకు ముందు హనుమకొండలోని కలెక్టరేట్ వద్ద టిఎన్‌జివొలు నిర్వహించిన ధర్నాలో హరీశ్ రావు మద్దతు తెలిపారు. దీంతో పోలీసులు అయన్ను అరెస్టు చేసి సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు.

# రాష్ట్ర ప్రజలకు మంత్రి పొన్నం రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

**హైదరాబాద్,ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రజలకు రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాఖీ పౌర్ణమి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా రాఖీ పౌర్ణమి నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే ఈ పవిత్రమైన రోజున ప్రతి కుటుంబంలో ఆనందం, సంతోషం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.తెలంగాణ ఆడబిడ్డల సంక్షేమం, భద్రత, సాధికారతకు ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రాఖీ పౌర్ణమి పండుగను రాష్ట్ర ప్రజలందరూ సోదరభావంతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని కోరారు.

# దేశాభివృద్ధిలో యువత, క్రీడాశక్తి ఎంతో ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

పాటు క్రీడాశక్తి కూడా ఎంతో అవసరమని మోదీ పేర్కొన్నారు. భారత్ ఒలింపిక్స్‌లో తగిన ప్రాతినిథ్యం వహించట్లేదని ప్రధాని విచారం వ్యక్తం చేశారు. దేశం క్రీడలపై ఎక్కువగా ఆసక్తి చూపడంలేదన్నారు. 2012లో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత్.. 12 ఆటల్లో మాత్రమే మెడల్స్ సాధించిందని తెలిపారు. సర్ఫింగ్ వంటి ఆటల్లో మన క్రీడాకారులు ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. దేశంలో ప్రతిభకు లోటు లేదని, మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తలపెట్టిందని తెలిపారు. ముఖ్యంగా 5 నుంచి 15 ఏళ్ల వారిలో టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. వచ్చే ఒలింపిక్స్‌లో భారత్ చెప్పుకోదగ్గ స్థాయిలో పథకాలను సాధించాలని ఆయన కోరారు. ఇందుకోసం ప్రభుత్వం.. క్రీడాకారులు, అలథెట్లకు సహాయ సహకారాలు అందిస్తుందని ప్రధాని హామి ఇచ్చారు. డిసెంబర్‌లో జరిగే 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సందర్భంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ పోటీలను నిర్వహించనున్నారు.

# 1,600 మంది గల్లంతు

(మొదటి పేజీ తరువాయి)

నిలుస్తుందని ప్రకటించింది. ఎంఈఏ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ గురువారంనాడిక్కడ మీడియాతో ఆ వివరాలు తెలియజేశారు. 'ఆచూకీ తెలియకుండా పోయిన 288 మంది భారతీయుల్లో త్రిశూలి-1 విద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తున్న 73 మంది ఉన్నారు. ఖాట్మండులోని భారత రాయబార కార్యాలయం వారి ఆచూకీ కోసం ప్రాజెక్టు అధికారులతో సంప్రదిస్తోంది.తమిళనాడు నుంచి 37 మంది, 49 మందితో కూడిన రెండు పర్యాటక బృందాలు ఉన్నాయి. వీరు సమ్రాట్, ఫ్లై ఎవరెస్ట్ ట్రావెల్ ఏజెన్సీల ద్వారా కైలాస్ మానసరోవర్ యాత్రకు వెళ్లారు. పశ్చిమబెంగాల్ నుంచి 32 మంది, కేరళ నుంచి 33 మంది, ఇతర రాష్ట్రాలకు చెందిన 62 మంది ఉన్నారు. సహాయక చర్యల విషయంలో నేపాల్ అధికారులతో సంప్రదిస్తున్నాం' అని జైశ్వాల్ చెప్పారు. ఇంతవరకూ తమిళనాడుకు చెందిన 21 మందిని కాపాడినట్టు జైశ్వాల్ తెలిపారు. చైనా వైపు 200 మంది భారతీయులు కోసం విజ్ఞప్తి చేస్తున్నారని చెప్పారు. వీరిలో 95 మంది గార్బస్‌లో ఉన్నారని, వారు నేపాల్‌లోకి ప్రవేశించేందుకు ముందుకు సాగుతున్నారని చెప్పారు. మరో నలుగురు గీలాంగ్ నగరంలో, 13 మంది జుటుల్పుక్‌లో ఉన్నారన వివరించారు. వరదలతో తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో పరిస్థితి ఎక్కడికప్పుడు మారుతోందన్నారు. భారతీయులను రక్షించేందుకు సంబంధిత అధికారులతో భారత నిరంతం సంప్రదింపులు సాగిస్తోందన్నారు.

# ఈషా ఫౌండేషన్‌లో విషాద ఛాయలు

**చెన్నై,ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈశా ఫౌండేషన్‌కు చెందిన 80 మంది యాత్రికులు నేపాల్ వరదల్లో గల్లంతైన నేపథ్యంలో సంస్థలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సద్గురు అనుచరులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. సాధారణంగా నవ్వుతూ కనిపించే సద్గురు జగ్గీ వాసుదేవ్ కూడా దుఃఖాన్ని అణుచుకోలేక పోయారు. కైలాశ్ యాత్ర అనంతరం ఈశా ఫౌండేషన్ యాత్రికులు టిబెట్‌లోని గ్యిరాంగ్ ఇమిగ్రేషన్ సెంటర్ వద్ద ఉన్న సమయంలో వరద ముంచెత్తినట్టు తెలుస్తోంది. టిబెట్‌లో జరిగిందని చెబుతూ సద్గురు కన్నీటిపర్యంతమయ్యారు. గురువారం అక్కడికి వెళదామనుకున్నా కుదరలేదని చెప్పారు. గల్లంతైన వారి గురించి ఇప్పటివరకూ తమకు అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని అన్నారు. పరిస్థితి చాలా దారుణంగా కనిపిస్తోందని భావోద్వేగానికి లోనయ్యారు. గ్యిరాంగ్ ఇమిగ్రేషన్ సెంటర్‌లో ఈశా యాత్రికుల బృందం ఉన్న సమయంలో ఆ ప్రాంతాన్ని వరద ముంచెత్తిందని చెప్పారు. తాము ఇమిగ్రేషన్ సెంటర్‌కు వచ్చినట్టు ఈశా గ్రూప్ లీడర్ ప్రవీణ్ నుంచి తనకు ఉదయం 9.05 గంటలకు మెసేజీ వచ్చిందని సద్గురు చెప్పారు. ఆ తరువాత 9.14కు ఆ భవన సముదాయాన్ని వరద ముంచెత్తిందని అన్నారు. గ్రూప్ లీడర్ ప్రవీణ్‌తో ఈశా ఫౌండేషన్ రెండు దశాబ్దాలకు పైగా అనుబంధం ఉందని చెబుతూ కన్నీటి పర్యంత మయ్యారు. కొన్ని క్షణాలకు తేరుకున్న ఆయన మళ్లీ మాట్లాడుతూ ప్రవీణ్ వద్ద ఉన్న నేపాల్ ఫోన్ నెంబర్ ఆ రోజంతా యాక్టివ్‌గా లేదని చెప్పారు. 'ఆయన దాటి వచ్చి ఉంటే నేపాల్ ఫోన్ యాక్టివ్ అయ్యి ఉండేది. కానీ అలా జరగలేదు. అంటే, గ్రూప్ మొత్తం ఇమిగ్రేషన్ సెంటర్‌లోనే ఉండి ఉంటుంది' అని తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తాను మరికొంత మందితో కలిసి అక్కడికి వెళ్లేందుకు భారత్, చైనాల అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. టిబెట్‌లో మంచు చరియలు విరిగిపడటంతో అక్కడి నదిలో పోటెత్తిన వరద దిగువ ఉన్న నేపాల్‌లో జలప్రయళం సృష్టించినట్టు తెలుస్తోంది. ఈ ఘటనలో 170 మంది మరణించగా, 1500 మంది గల్లంతయ్యారు. ఈ ఘటనలో గల్లంతైన భారతీయుల్లో 100 మంది ఆచూకీ తెలిసినట్టు సమాచారం.

# ఎఐసిసి పరిధిలో కొండా సురేఖ వ్యవహారం

(మొదటి పేజీ తరువాయి)

కమిటీ నివేదికను ఏఐసీసీకి పంపించడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఉందని, అయితే అది క్రమశిక్షణకు లోబడి ఉండాలన్నారు. ఇతర పార్టీలతో పోలిస్తే కాంగ్రెస్‌లోనే స్వేచ్ఛ ఎక్కువన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఎవరిపైనా కోపాలు, కక్షలు ఉండవని.. కొండా మురళి తనతో ఎలాంటి సంప్రదింపులు జరుపలేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. స్వాగతిస్తామని చెప్పారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చినంత ప్రాధాన్యం ఏ పార్టీ ఇవ్వ లేదన్నారు. ఇకపోతే తెలంగాణకు రావాల్సిన నీటి వాటాలో రాజీ ఉండదని తేల్చిచెప్పారు. తెలంగాణకు ఏ రకంగానూ అన్యాయం జరగకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. తనకు సర్ నోటీసు అందిందని.. వివరాలు సమర్పిస్తానని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# బిఆర్ఎస్ హస్తగతానికి హరీష్‌రావు కుట్ర: కల్వకుంట్ల కవిత

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారని చెప్పారు. బిఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునేందుకు సిఎం రేవంత్‌రెడ్డితో, బిజెపితో దోస్తానా చేస్తున్నారని ఆరోపించారు. బిజెపితో హరీష్ రావు దోస్తీకి సంబంధించి తన వద్ద ఆధారాలున్నాయన్నారు. ఇప్పుడు తాను బిఆర్ఎస్‌లో లేను అని, ఆ పార్టీ ఎటు పోయినా తనకు సంబంధం లేదని అన్నారు. కానీ హరీష్‌రావు గురించి ప్రజలకు తెలియాలనే ఈ విషయం బయటకు చెబుతున్నానన్నారు.

.తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రావాళ్ల చేతిలో బందీ అయ్యారని మండిపడ్డారు. బ్రహ్మణ పరిషత్‌కు ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను ఆంధ్రావాళ్లను నియమించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రహ్మణ పరిషత్ ఛైర్మన్‌గా ఉన్న బసవరాజు శ్రీనివాస రాజు అనే వ్యక్తి పచ్చి తెలంగాణ వ్యతిరేకి అని, తెలంగాణను ఉద్యమ సమయంలో రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన వ్యక్తికి ఆ పదవి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. తెలంగాణ బ్రహ్మణులలో అర్హులు లేరా..? అని నిలదీశారు.యాదగిరి గుట్ట బోర్డు మెంబర్లలో ఆంధ్రా హీరో భార్యకు పదవి కట్టబెట్టారని విమర్శించారు. తెలంగాణ వాళ్ల పైసలతో కట్టిన గుడిలో ఆంధ్రావాళ్లకు పెత్తనం ఎలా ఇస్తారన్నారు. జనసేనకు చెందిన ఓ ఎంపీ కుమారుడు 6 కోట్ల కారు వేసుకోని ఒడిశాకు చెందిన 25 ఏళ్ల అమ్మాయిని గుద్ది చంపితే సిఎం పట్టించుకోలేదని పేర్కొన్నారు.

# మహమ్మద్ గౌస్‌పల్లిలో రూ.45 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం

### గ్రామ అభివృద్ధికి మరో ముందడుగు

### పలు కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం

### పనులను ప్రారంభించిన సర్పంచ్ పసుల కార్తీక్

### నిధులు మంజూరు చేసిన మంత్రి సీతక్కకు ప్రత్యేక కృతజ్ఞతలు



**జేడీ మల్లంపల్లి ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** జేడీ మల్లంపల్లి మండలం మహమ్మద్ గౌస్‌పల్లి గ్రామంలో అభివృద్ధి పనులకు వేగం పుంజుకుంది. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ రూ.45 లక్షల భారీ వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు గురువారం గ్రామ సర్పంచ్ పసుల కార్తీక్ శ్రీకారం చుట్టారు. సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని పలు కాలనీల్లో ప్రజలకు అవసరమైన ప్రాంతాలను గుర్తించి రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. **మంత్రి సీతక్క చొరవతో నిధుల మంజూరు** మహమ్మద్ గౌస్‌పల్లి గ్రామ అభివృద్ధిపై రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని సర్పంచ్ పసుల కార్తీక్ తెలిపారు. గ్రామంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశంతో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.45 లక్షల నిధులు మంజూరు చేయడంలో మంత్రి సీతక్క చొరవ ఎంతో కీలకమని పేర్కొన్నారు. గ్రామ అవసరాలను గుర్తించి నిధులు కేటాయించిన మంత్రి సీతక్కకు గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. **ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగేలా చర్యలు** గ్రామంలోని పలు కాలనీల్లో సరైన రహదారులు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో రోడ్లు బురదమయంగా మారడంతో ప్రజలు, వృద్ధులు, విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉండేదన్నారు. సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయితే ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగడంతో పాటు గ్రామంలోని అంతర్గత రహదారులు మెరుగుపడతాయని చెప్పారు. **మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం** గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని పసుల కార్తీక్ తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై దృష్టి సారిస్తూ ప్రజలకు అవసరమైన సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. **అభివృద్ధి పనులతో ప్రజల్లో హర్షం** రూ.45 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో మహమ్మద్ గౌస్‌పల్లి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. చాలా కాలంగా ఎదురుచూస్తున్న రహదారి సమస్యలకు పరిష్కారం లభించనుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించిన మంత్రి సీతక్కకు, పనులను ముందుకు తీసుకెళ్తున్న సర్పంచ్ పసుల కార్తీక్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు మేకల ప్రశాంత్, గ్రామ శాఖ అధ్యక్షుడు ముంజల కుమార్ స్వామి, ఉపసర్పంచ్ చింతనిప్పుల రఘు, వార్డు సభ్యులు గాజుల సునీత, మంద రవి, కనుకం రవి, రజినీకార్ రెడ్డి, రొట్టె రమేష్, రాజు, రవీందర్, మహేందర్, బాలకృష్ణతో పాటు గ్రామ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం చేపట్టిన పాదయాత్రకు బీఆర్ఎస్ నాయకుల సంఘీభావం



**సత్తుపల్లి, ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించి, వారికి న్యాయం చేయాలనే డిమాండ్‌తో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర సత్తుపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. సత్తుపల్లి పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద పాదయాత్ర బృందానికి బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికి, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా కూసంపూడి మహేష్ మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజానికి సేవ చేస్తూ ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించేలా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, కౌన్సిలర్ బెల్లంకొండ రాము, చాంద్ పాషా, మల్లూరి అంకంరాజు, పర్వతనేని వేణు, గుండ్ర రఘు, నడ్డి ఆనందరావు, మీదే శ్రీను, అక్షింతల చంటి, మరికంటి శ్రీను, మేకల నర్సింహారావు, షేక్ బాబు తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జులూస్-ఎ-ముహమ్మదీ ర్యాలీలో షేక్ మజర్ బాబా..





**కరీంనగర్ టౌన్ ఆగస్టు 27(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లాలో 1501 మార్కజ్ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జులూస్-ఎ-ముహమ్మదీ ర్యాలీలో ఎంఐఎం యువజన నాయకుడు, సామాజిక కార్యకర్త షేక్ మజర్ బాబా పాల్గొన్నారు. మిలాద్-ఉన్-నబీ నీ సందర్భంగా నిర్వహించిన ఈ ర్యాలీ భక్తిశ్రద్ధలు, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా కొనసాగింది. ముస్లిం సోదరులు, యువత, మతపెద్దలు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రవక్త మహమ్మద్ నీ బోధించిన శాంతి, సోదరభావం, మానవత్వం, ఐక్యత సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా షేక్ మజర్ బాబా మాట్లాడుతూ, ప్రవక్త మహమ్మద్ నీ చూపిన మానవతా మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని అన్నారు. సమాజంలో శాంతి, సోదరభావం, ఐక్యతను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. 1501 మార్కజ్ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జులూస్-ఎ-ముహమ్మదీ ర్యాలీ విజయవంతం కావడంతో నిర్వాహకులు, పాల్గొన్న యువతకు ఆయన అభినందనలు తెలిపారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఎస్ఆర్) 2026: గ్రామీణ, వార్డు సభల్లో ముసాయిదా ఓటరు జాబితాల పరిశీలన

### - జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.



**సిరోల్ ఆగస్టు 27(పి.సి.డబ్ల్యూ న్యూస్):** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఎస్ ఆర్) 2026 కార్యక్రమంలో భాగంగా జిల్లా అంతటా నిర్వహించిన గ్రామ, వార్డు సభల్లో ముసాయిదా ఓటరు జాబితాను ప్రజల పరిశీలన కోసం అందుబాటులో ఉంచినట్లు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. ఈ సందర్భంగా సిరోలు మండలం చిలుక్కోడు, గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రామసభలో జిల్లా కలెక్టర్ స్వయంగా పాల్గొని ఓటరు నమోదు, సవరణల ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ డ్రాఫ్ట్ ముసాయిదా లో తమ పేరు సరిగా ఉందో లేదో తెలుసుకొని ఓటును నిర్ధారించుకోవడం కోసం నెల రోజుల సమయం ఉందని, నోటీసులు అందుకున్న ఓటర్లు తమ నిర్ధారణ సర్టిఫికెట్లు అప్లోడ్ చేసి సమర్పించి ఓటు హక్కును భద్రపరుచుకోవాలని తెలిపారు, ఓటరు జాబితా తనిఖీ: 18 ఏళ్లు నిండిన అర్హులైన పౌరులు తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో సరిచూసుకోవాలని, పేరు లేని పక్షంలో వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కొత్త ఓటర్ల నమోదు (ఫారమ్-6): జనవరి 1, 2026 నాటికి 18 ఏళ్లు పూర్తయ్యే యువత ఫారమ్-6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. తప్పుల సవరణలు & మార్పులు (ఫారమ్-8): ఓటరు కార్డులో పేరు, చిరునామా, పుట్టిన తేదీ లేదా ఫోటో తప్పుగా ఉంటే ఫారమ్-8 ద్వారా సరిచేసుకోవచ్చు. ఓటరు తొలగింపు (ఫారమ్-7): మరణించిన వారి లేదా ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా తరలివెళ్లిన వారి పేర్లను జాబితా నుండి తొలగించేందుకు ఫారమ్-7 ఉపయోగించవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ సేవలు: నేరుగా బి.ఎల్.ఓ (దీూా) లేదా గ్రామ/వార్డు సచివాలయాల వద్ద మాత్రమే కాకుండా, ‘Voter Helpline App» ýñ<‘ nvsp.in వెబ్‌సైట్ ద్వారా కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, తప్పులు లేని పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ ప్రత్యేక అవకాశాన్ని వినియోగించుకుని తమ ఓటు హక్కును నిర్ధారించుకోవాలని , పిలుపునిచ్చారు. నెలరోజుల సమయం ఉందని నోటీసులు అందుకున్న ఓటర్లు తమ ఓటు హక్కును సంబంధిత ఫారాల ద్వారా నిర్ధారించుకోవాలని అందుకోసం రెవెన్యూ అధికారులు సిద్ధంగా ఉంటారని తెలిపారు. ఆర్డీవో గణేష్ , తహసిల్దార్ పున్నం చందర్, స్థానిక సర్పంచ్ ఉడుముల వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ తేజవాత్ సుధాకర్, లక్ష్మీనారాయణ, ఎంపీడీవో గౌస్ పాషా, పంచాయతీ సెక్రెటరీ నాగయ్య, బి.ఎల్.ఓలు, పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణ గ్రామర్ స్కూల్‌లో ఘనంగా ముందస్తు రాఖీ పండుగ వేడుకలు

**కల్లూరు, ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ గ్రామర్ స్కూల్‌లో ముందస్తు రాఖీ పౌర్ణమి వేడుకలను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. రాఖీ పండుగ సందర్భంగా విద్యార్థులు పెద్ద సంఖ్యలో రంగురంగుల రాఖీలను కొనుగోలు చేసి పాఠశాలకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా బాలికలు తమ సోదర భావంతో బాలురకు రాఖీలు కట్టి, ప్రేమానురాగాలకు ప్రతీకగా రాఖీ బంధాన్ని పంచుకున్నారు. బాలురు తమ సోదరీమణుల పట్ల ఆప్యాయత, గౌరవం, రక్షణ భావాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థుల సందడితో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ జనీమియా విద్యార్థులకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాఖీ పండుగ సోదర, సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీక అని అన్నారు. విద్యార్థులు ఎల్లప్పుడూ పరస్పరం ప్రేమాభిమానాలతో, సోదరభావంతో మెలగాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఇస్మాయిల్ మాట్లాడుతూ ఇటువంటి పండుగల ద్వారా విద్యార్థుల్లో ప్రేమ, సోదరభావం, పరస్పర గౌరవం, భారతీయ సంస్కృతి పట్ల అవగాహన పెంపొందుతాయని తెలిపారు. ఈ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని రాఖీ పండుగను ఘనంగా జరుపుకున్నారు



# ఉద్యమకారుల త్యాగాలకు గౌరవం ఎప్పుడు?

### సీపీయూఎస్ఐడీబీఎస్‌వీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ... కలెక్టరేట్ ఎదుట ధర్నా...

### 20 డిమాండ్లతో ప్రభుత్వానికి హెచ్చరిక






**హనుమకొండ ప్రతినిధి,ఆగస్టు 27(పి.సి.డబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన వేలాది మంది ఉద్యమకారులు నేటికీ సరైన గుర్తింపు, సంక్షేమానికి దూరంగా ఉండటం దురదృష్టకరమని పేర్కొంటూ సీపీయూఎస్ఐ, డీబీఎస్‌వీ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి ఉద్యమకారుల హక్కుల కోసం నినాదాలు చేశారు. తర్వాత జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట ప్రధాన కార్యదర్శి వెంకన్న, జిల్లా కార్యదర్శి గడ్డం శరత్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమాన్ని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం సరికాదన్నారు. నిజంగా ఉద్యమంలో పనిచేసిన వారిని మాత్రమే గుర్తించేలా పారదర్శక వ్యవస్థ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం రాజకీయాలకు అతీతంగా ఉన్న ఉద్యమ నాయకులతో కమిటీలు ఏర్పాటు చేసి వారి సిఫారసుల మేరకే గుర్తింపు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, సంక్షేమ బోర్డు, ఉచిత బస్సు, రైలు ప్రయాణం, కుటుంబాలకు ఉచిత విద్య, వైద్యం, 250 గజాల ఇంటి స్థలం, పక్కా ఇల్లు, రూ.10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యమంలో విశేష సేవలందించిన జర్నలిస్టులను గౌరవించి ఆర్థిక సహాయం అందించాలని, ఉద్యమ కవులు, రచయితలు, కళాకారులకు రూ.25 వేల పెన్షన్‌తో పాటు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఉద్యమంలో నష్టపోయిన కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఉద్యమకారులపై నమోదైన అన్ని అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని, మారోజు వీరన్న విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయడంతో పాటు ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని, 145 మంది అమరులను తెలంగాణ అమరవీరులుగా ప్రకటించి వారి కుటుంబాలకు అన్ని ప్రభుత్వ సదుపాయాలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో ఐదు ఎకరాల్లో అమరవీరుల స్మృతివనం ఏర్పాటు చేసి, తెలంగాణ కవులు, కళాకారులకు సినిమా రంగంలో అవకాశాలు కల్పించడంతో పాటు ఉద్యమకారుల ఉపాధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీయూఎస్ఐడీబీఎస్‌వీ కమిటీ నాయకులు, ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

# వృక్షానికి “రాఖీ” రక్ష ప్రకృతిని కాపాడే బాధ్యత మనందరిది

**మంచినీళ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ముందస్తుగా రాఖీ వేడుకలు**

**మొక్కలకు రాఖీలు కట్టి సంరక్షణ బాధ్యతలు స్వీకరించిన విద్యార్థులు**

**“చెట్టును కాపాడితే.. చెట్టు మనల్ని కాపాడుతుంది”**







**మల్లంపల్లి మండల ప్రతినిధి ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి మండలం మంచినీళ్లపల్లి గ్రామంలో రాఖీ పండుగను పురస్కరించుకుని ప్రాథమిక పాఠశాలలో ముందస్తుగా రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోదర, సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలు, రక్షణకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను ఈసారి ప్రకృతి పరిరక్షణకు, పర్యావరణ బాధ్యతకు ప్రతీకగా నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా విద్యార్థులు స్వయంగా పూలతో తయారు చేసిన రాఖీలను తీసుకువచ్చి ఒకరికొకరు కట్టుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు రాఖీ పండుగ విశిష్టతను, సోదరుడుసోదరి మధ్య ఉండే ప్రేమ, ఆప్యాయత, రక్షణ భావనలను విద్యార్థులకు వివరించారు. **వృక్షాలకు రాఖీలు.. ప్రకృతికి రక్ష** సోదరసోదరీమణుల మధ్య రక్షణ భావనను ప్రకృతికి అన్వయిస్తూ పాఠశాల ఆవరణలోని మొక్కలు, వృక్షాలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు రాఖీలు కట్టారు. “వృక్షానికి రాఖీ ప్రకృతికి రక్ష” అనే నినాదంతో పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కల్పించారు. చెట్లు మనకు స్వచ్ఛమైన గాలి, నీడ, ఆహారం అందించడంతో పాటు వర్షపాతం, పర్యావరణ సమతుల్యతకు ఎంతో కీలకంగా నిలుస్తున్నాయని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. మనిషి జీవనానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా వృక్షాలు అందిస్తున్న సేవలను గుర్తించి వాటిని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. **“వృక్షాలను తోబుట్టువులుగా భావించి కాపాడాలి”** పాఠశాల ప్రధానోపాధ్యాయులు దిలీప్ మాట్లాడుతూ రాఖీ అనేది కేవలం సోదరసోదరీమణుల మధ్య రక్షణకు చిహ్నం మాత్రమే కాదన్నారు. మన చుట్టూ ఉన్న ప్రకృతి, మొక్కలు, వృక్షాలను కూడా రక్షించాలనే బాధ్యతను గుర్తుచేసే పండుగగా రాఖీని మలచుకోవాలని సూచించారు. “మానవ జీవితంలో వృక్షాలు కూడా తోబుట్టువుల వంటివే. మనకు నిరంతరం సేవ చేస్తున్న వృక్షాలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత” అని ఆయన అన్నారు. **ప్రతి విద్యార్థికి ఒక మొక్క బాధ్యత** విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో రాఖీ కట్టిన ప్రతి మొక్క సంరక్షణ బాధ్యతను ఒక్కో విద్యార్థికి అప్పగించినట్లు ప్రధానోపాధ్యాయులు దిలీప్ తెలిపారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పోయడం, వాటి చుట్టూ పరిశుభ్రత పాటించడం, మొక్కలను ఎవరూ ధ్వంసం చేయకుండా చూడటం వంటి బాధ్యతలను విద్యార్థులు స్వీకరించారు. ఈ విధానం ద్వారా మొక్కలపై వారికి ఆత్మీయత పెరగడంతో పాటు బాధ్యతాయుతమైన పర్యావరణ పరిరక్షణ భావన అలవడుతుందని తెలిపారు. **నాటడమే కాదు.. సంరక్షించడమే అసలు బాధ్యత** ఒక మొక్కను నాటడం ఎంత ముఖ్యమో, నాటిన మొక్కను వృక్షంగా ఎదిగే వరకు సంరక్షించడం అంతకంటే ముఖ్యమని ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. భవిష్యత్ తరాలకు పచ్చని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించడంతో పాటు పర్యావరణ పరిరక్షణను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. **విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం** పాఠశాలలో నిర్వహించిన ఈ వినూత్న కార్యక్రమం విద్యార్థుల్లో సోదరభావంతో పాటు ప్రకృతిపై ప్రేమ, మొక్కలను కాపాడాలనే బాధ్యత, పర్యావరణ పరిరక్షణపై చైతన్యాన్ని పెంపొందించింది. “చెట్టును కాపాడితే.. చెట్టు మనల్ని కాపాడుతుంది” అనే సందేశాన్ని ప్రతి విద్యార్థి తమ కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉమాశంకర్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు మొక్కలకు రాఖీలు కట్టి వాటి సంరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో ఉత్సాహాన్ని నింపడంతో పాటు ప్రకృతి పరిరక్షణపై వినూత్న సందేశాన్ని అందించింది.

# ఇండ్ల స్థలాలకోసం జర్నలిస్టుల పాదయాత్ర బాధాకరం

**జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి..**

**ప్రభుత్వం స్పందించకుంటే జర్నలిస్టులతో కలసి పోరాటాన్ని ఉధృతం చేస్తాం...**

**బిఆర్ఎస్, సిఐటియు, జనసేన, ఎమ్మార్పీఎస్..**

**జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయిస్తాం... కాంగ్రెస్**








**కల్లూరు, ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలుకోసం ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ నిరంతరం శ్రమించే జర్నలిస్టులు నేడు వారి సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కి పాదయాత్ర చేయటం బాధాకరమని, వెంటనే ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని బిఆర్ఎస్, జనసేన, సిఐటియు ఇతర రాజకీయ పార్టీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం చేపట్టిన పాదయాత్ర గురువారం సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరు మండల కేంద్రానికి చేరుకుంది. మండల కేంద్రంలోని భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఖదీర్ శ్రీనివాస్ రెడ్డిలు పూలమాలవేసి నివాళులర్పించారు. మండల కేంద్రానికి చేరుకున్న జర్నలిస్టుల పాదయాత్రకు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు భారీ ఎత్తున శాలువాలతో సత్కరించి పూలమాలతో ఘనంగా స్వాగతం పలికారు. మండల కేంద్రం నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర కొనసాగింది. తాసిల్దారి కార్యాలయంలో ఉన్న అధికారికి వినతిపత్రం అందజేసి జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు జర్నలిస్టులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో రాజకీయ పార్టీలు నాయకులు ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని బహిరంగంగా హామీలిచ్చి మూడు సంవత్సరాలుగా కాలయాపన చేస్తుందే తప్ప వారి హామీని అమలు చేయడం లేదని విమర్శించారు. తక్షణమే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ప్రభుత్వశీ స్పందించకపోతే జర్నలిస్టులతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేసి ఇళ్ల స్థలాలు సాధిస్తామని అన్నారు. బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య ఆదేశాలతో మాజీ జెడ్పిటిసిలు, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులుతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించి శాలువలు కప్పి పాదయాత్రకు సంఘీభావం తెలియజేశారు. ఏర్పాటు చేసిన సభలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు మాజీ జెడ్పిటిసి కట్టా అజయ్ కుమార్, లక్కినేని రఘు, మేకల కృష్ణ, కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణ మాట్లాడుతూ విలేకరులు వినూత్నంగా చేపట్టిన పాదయాత్ర ద్వారా న్యాయమైన కోరిక కోరారని ప్రభుత్వము వెంటనే స్పందించి జర్నలిస్టులకు ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. జర్నలిస్టులో కూడా చాలామంది నిరుపేదలు ఉన్నారని ఏ ప్రభుత్వమైనా వారి సేవలు వినియోగించుకుంటూ వారి న్యాయమైన కోరికలు తీర్చలేకపోయారని అన్నారు. ఇప్పటికైనా జర్నలిస్టుల యొక్క కల నెరవేరాలంటే తప్పకుండా ఇల్లు, ఇళ్ల స్థలాలు విషయంలో తగిన న్యాయం చేయాలని వారు కోరారు.కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పొట్రూ అర్జున్ రావు, పట్టణ అధ్యక్షులు షేక్ ఉస్మాన్, కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీని అమలుపరిచేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే మట్ట రాగమయి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం కోసం తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సీనియర్ నాయకులు మాజీ వార్డు సభ్యులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిటిసి ఖమ్మంపాటి పుల్లారావు, మాజీ వార్డు సభ్యులు వెంగళ పెంటయ్య, షేక్ కమ్లి ,జనసేన పార్టీ నాగేశ్వరరావు, సిఐటియు వెంకటేశ్వరరావు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ జర్నలిస్టుల పాదయాత్ర కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బి.రాజశేఖర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, టిబిజేపి జిల్లా కార్యదర్శి మానుకొండ రవికిరణ్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ నలబోల మధుశ్రీ,, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.ఎస్ చక్రవర్తి, సీనియర్ జర్నలిస్ట్ మారెడ్డి నాగేందర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, కొరకొప్పుల రాంబాబు, పీజీబీఏ కెమెరామెన్స్ జిల్లా కార్యదర్శి భూక్య గణేష్, అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ అర్షద్, నాయకులు గంగుల గోపి, మందా శరత్, చిత్రా పవన్, పెరుమాళ్ళపల్లి నాగార్జున, బొల్లం రామారావు, దాసరి డేవిడ్ రాజు, కోట పుల్లయ్య, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మండల అధ్యక్షులు ఖమ్మం పాటి మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జానపాటి రోజ్ వేణు, తాళ్లూరి సుమన్, జిల్లెల్ల మహేష్, ఖమ్మంపాటి శ్రీనివాసరావు,అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌లో అనిరా ఆలివ్స్‌కు రెండు పతకాలు



**హైదరాబాద్ ఆగస్టు 27(పిసిడబ్ల్యూ న్యూస్):** జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్‌లో అనిరా ఆలివ్స్ సంగేపు అద్భుత ప్రతిభ కనబరిచి రెండు పతకాలు కైవసం చేసుకుంది. అండర్-8 బాలికల విభాగంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన అనిరా కాటా, కుమిటే విభాగాల్లో పతకాలు సాధించి సత్తా చాటింది.కాటా విభాగంలో రజత పతకం (సిల్వర్),కుమితే విభాగంలో కాంస్య పతకం (బ్రాంజ్) గెలుపొందారు. అనిరా గతంలో కూడా పలు కరాటే పోటీల్లో పాల్గొని పతకాలు సాధించింది. కరాటేతో పాటు తైక్వాండోలోనూ శిక్షణ తీసుకుంటూ గతంలో పతకాలు గెలుచుకుంది. ప్రస్తుతం కోచ్ కిరణ్ పర్యవేక్షణలో అనిరా కరాటేలో ప్రత్యేక శిక్షణ పొందుతోంది. జాతీయ స్థాయిలో రెండు పతకాలు సాధించిన అనిరాను కోచ్ కిరణ్, పలువురు క్రీడా ప్రముఖులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

## చిలుకోయలపాడులో అట్టహాసంగా ఎస్ఐఆర్ ఫేజ్2 గ్రామసభ



**• ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**



**సీరోల్, ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా సీరోల్ మండలం చిలుకోయలపాడు గ్రామంలో ఎస్ఐఆర్ ఫేజ్2 గ్రామసభ అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ హాజరై గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామానికి చేరుకున్న కలెక్టర్‌కు గ్రామ సర్పంచ్ ఊడుగుల వెంకన్న పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి ఉన్న అత్యంత ముఖ్యమైన హక్కు అని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని తెలిపారు.మరణించిన వారి పేర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి వివరాలు, డూప్లికేట్ ఓటర్ల వివరాలను గుర్తించి జాబితాను ప్రక్షాళన చేయడమే ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ వివరించారు. ప్రజలు అధికారులు అడిగే వివరాలను సక్రమంగా అందించి ఎస్ఐఆర్ ప్రక్రియకు సహకరించాలని కోరారు.అలాగే ఓటర్ల జాబితాలో తమ పేరు, కుటుంబ సభ్యుల పేర్లు సరిగ్గా ఉన్నాయా లేదా అన్నది ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని సూచించారు. ఎవరైనా అర్హులైన వ్యక్తి ఓటు హక్కు కోల్పోకుండా, అదే సమయంలో అనర్హమైన లేదా డూప్లికేట్ నమోదులు లేకుండా పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో గణేష్ , తహసిల్దార్ పున్నం చందర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రావణి, గ్రామ పాలనాధికారి లలిత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, సీరోల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుడిగం లక్ష్మీనారాయణ,ఎంపీడీవో గౌస్ పాషా,పంచాయతీ సెక్రెటరీ నాగయ్య, బిఎల్ఓలు, బి ఎల్ ఏ లు, అంగన్వాడి టీచర్లు, రేషన్ షాప్ డీలర్లు, పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# భూ రికార్డులను శాస్త్రీయంగా ప్రక్షాళన చేసిన తర్వాతే నిషేధిత జాబితాను ఖరారు చేయాలి!



### ప్రభుత్వ శాఖల రికార్డుల మధ్య తీవ్రమైన వైరుధ్యాలు ఉన్నాయని విమర్శ!

### ములుగు జిల్లా భూములపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని న్యాయవాది, భాజపా నాయకుడి డిమాండ్!

**ములుగు: ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లాలో భూములకు సంబంధించి వివిధ ప్రభుత్వ శాఖలు నిర్వహిస్తున్న రికార్డుల మధ్య ఉన్న వైరుధ్యాలను సమగ్రంగా పరిశీలించి, భూ రికార్డులను శాస్త్రీయంగా, చట్టబద్ధంగా ప్రక్షాళన చేయాలని ప్రముఖ న్యాయవాది, భాజపా ములుగు జిల్లా ప్రచార విభాగ ప్రతినిధి శ్యాంప్రసాద్ పటేల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ రికార్డుల్లోని విభిన్న వివరాలను సమన్వయం చేయకుండా అనేక భూములను రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22–ఎ నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చడం, కొనసాగించడం పట్ల స్పష్టత ఇవ్వాలని కోరారు.తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక, గణాంకాల శాఖ ప్రచురించిన భూ కమతల గణన 2021–22 గణాంకాలు ములుగు జిల్లా భూ పరిస్థితిపై ఒక ముఖ్యమైన ప్రభుత్వ ఆధారాన్ని అందిస్తున్నాయని భాజపా నాయకుడు, ప్రముఖ న్యాయవాది శ్యాంప్రసాద్ పటేల్ తెలిపారు. ఈ అధికారిక గణాంకాల ప్రకారం ములుగు జిల్లాలో 78,989 ఆపరేషనల్ హోల్డింగ్స్‌కు 72,548.40 హెక్టార్ల భూమి నమోదై ఉందన్నారు. ఇది సుమారు 1,79,260 ఎకరాలు, అంటే దాదాపు 1.79 లక్షల ఎకరాలు. అయితే 72,548.40 హెక్టార్లను ములుగు జిల్లాలో ప్రస్తుతం సాగులో ఉన్న ఖచ్చితమైన భూమిగా పరిగణించరాదని స్పష్టం చేశారు. ఆపరేషనల్ హోల్డింగ్ అనేది ఒక వ్యక్తి, కుటుంబం లేదా సంస్థ వ్యవసాయ కార్యకలాపాల కోసం నిర్వహిస్తున్న భూమిని సూచించే గణాంక యూనిట్ మాత్రమేనని, అది ప్రతి సందర్భంలో చట్టపరమైన యాజమాన్య హక్కుతోనూ, ఒక నిర్దిష్ట సమయంలో పంట వేసిన వాస్తవ విస్తీర్ణంతోనూ సమానం కాదని పేర్కొన్నారు.అగ్రికల్చర్ సెన్సస్‌లో ఇంత విస్తృతమైన ఆపరేషనల్ ఏరియా నమోదైనప్పుడు, ఆ భూమికి సంబంధించిన ప్రస్తుత ఆర్ఓఆర్–1బి, పహాణీ, భూ భారతి, సర్వే రికార్డులు, ల్యాండ్ పార్సెల్ మ్యాప్స్, పట్టాదారు పాస్‌బుక్స్, వ్యవసాయ శాఖ రికార్డులు తదితరాల్లో ఎంత విస్తీర్ణం నమోదై ఉందో ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని ప్రశ్నించారు. ఒకే భూమికి సంబంధించి వివిధ ప్రభుత్వ రికార్డుల్లో వేర్వేరు విస్తీర్ణాలు నమోదై ఉంటే, అసలు సరైన విస్తీర్ణం ఎంత, ఏ రికార్డు ఆధారంగా తుది నిర్ణయం తీసుకోవాలి, ఆ తేడాకు కారణం ఏమిటి అనే విషయాలను ప్రభుత్వం తేల్చాల్సిన అవసరం ఉందన్నారు.ఒకే సర్వే నంబర్‌లోని భూమి ఒక రికార్డులో పట్టా భూమిగా, మరో రికార్డులో ప్రభుత్వ భూమిగా, మరొక రికార్డులో అసైన్డ్, సీలింగ్, అటవీ లేదా ఇతర నిషేధిత కేటగిరీగా నమోదై ఉంటే, ఆ భూమి స్వభావం ఎప్పుడు, ఏ ప్రభుత్వ ఉత్తర్వు లేదా చట్టబద్ధమైన ప్రొసీడింగ్ ద్వారా మారిందో ప్రభుత్వం వెల్లడించాలని ప్రముఖ న్యాయవాది శ్యాంప్రసాద్ పటేల్ డిమాండ్ చేశారు. అలాగే సెత్వార్‌లో ఒక విస్తీర్ణం, ఆర్ఓఆర్‌లో మరో విస్తీర్ణం, భూ భారతిలో ఇంకో విస్తీర్ణం, వ్యవసాయ రికార్డుల్లో మరో విస్తీర్ణం ఉంటే వాటిని పరస్పరం సమన్వయం చేయకుండా కేవలం ఒక డిజిటల్ నమోదు ఆధారంగా భూమిపై నిషేధం విధించడం సరికాదన్నారు. ప్రతి 22–ఎ నమోదుకు సంబంధించి ప్రభుత్వం సర్వే నంబర్, సబ్–డివిజన్, అసలు విస్తీర్ణం, ప్రస్తుత విస్తీర్ణం, నిషేధిత కేటగిరీ, సంబంధిత చట్టపరమైన నిబంధన, ప్రభుత్వ ఉత్తర్వు, ప్రొసీడింగ్ నంబర్, ఉత్తర్వు తేదీ, సంబంధిత అధికారి, అసలు ఆధార రికార్డు వంటి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. మొత్తం సర్వే నంబర్ నిషేధితమా లేదా అందులోని కొంత విస్తీర్ణం మాత్రమే నిషేధితమా అనే విషయాన్ని కూడా స్పష్టంగా పేర్కొనాలని అన్నారు.సీలింగ్, ఆర్ఓఎఫ్ఆర్, అసైన్డ్ భూములు, భూసేకరణ లేదా ఇతర భూ వివాదాలకు సంబంధించి కోర్టులు లేదా సమర్థవంతమైన చట్టబద్ధ సంస్థలు ఇప్పటికే నిర్ణయాలు ఇచ్చిన సందర్భాల్లో, ఆ నిర్ణయాలకు అనుగుణంగా రెవెన్యూ రికార్డులను సవరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. కోర్టు తీర్పు ఒక ప్రభుత్వ రికార్డులో ఉండి, దానికి విరుద్ధమైన వర్గీకరణ మరో ప్రభుత్వ రికార్డులో కొనసాగితే, ఆ వైరుధ్యాన్ని తొలగించాల్సింది ప్రభుత్వమే అని పేర్కొన్నారు. ములుగు జిల్లాలో 22–ఎ కింద ఉన్న భూములపై ప్రభుత్వం మండలం, గ్రామం, సర్వే నంబర్ వారీగా శ్వేతపత్రం విడుదల చేయాలని భాజపా జిల్లా ప్రచార విభాగ ప్రతినిధి శ్యాంప్రసాద్ పటేల్ డిమాండ్ చేశారు. శ్వేతపత్రంలో 22–ఎలో ఉన్న మొత్తం ఆస్తుల సంఖ్య, మొత్తం విస్తీర్ణం, మండలం, గ్రామం, సర్వే నంబర్ వారీగా వివరాలు, ఏ కేటగిరీ కింద భూమిని నిషేధించారో, నిషేధానికి ఆధారమైన ప్రభుత్వ ఉత్తర్వులు, అసలు మరియు ప్రస్తుత విస్తీర్ణం, ఆర్ఓఆర్, పహాణీ, భూ భారతి వివరాలు, కోర్టు కేసులు, తీర్పులు, అభ్యంతరాలు, అప్పీలు, రికార్డు సవరణకు పెండింగ్‌లో ఉన్న భూముల వివరాలు వెల్లడించాలని కోరారు.సెత్వార్, ఆర్ఓఆర్–1బి, పహాణీ, భూ భారతి, జీఐఎస్, అగ్రికల్చర్ సెన్సస్, సాగు రికార్డులు, ఆర్ఓఎఫ్ఆర్, అటవీ, సీలింగ్, అసైన్డ్, భూసేకరణ, 22–ఎ రికార్డులను పరస్పరం పోల్చి ల్యాండ్ రికార్డ్ కాంట్రాడిక్షన్ రిజిస్టర్ ఏర్పాటు చేయాలని ప్రముఖ న్యాయవాది శ్యాంప్రసాద్ పటేల్ సూచించారు. ప్రతి సర్వే నంబర్‌కు సంబంధించి ఏ రికార్డులో ఎంత విస్తీర్ణం ఉంది, తేడా ఎంత, తేడాకు కారణం ఏమిటి, ఏ ఉత్తర్వు ఆధారంగా మార్పు జరిగింది, చివరకు చట్టబద్ధంగా సరైన స్థితి ఏమిటి అనే వివరాలను అందులో నమోదు చేయాలని కోరారు. నిజంగా ప్రభుత్వానికి చెందిన భూములు, అటవీ భూములు, చట్టబద్ధంగా అసైన్డ్ భూములు, సీలింగ్ భూములు లేదా ఇతర చట్టబద్ధంగా నిషేధిత భూములను రక్షించడంలో ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. డిమాండ్ 22–ఎ చట్టాన్ని బలహీనపరచడం కాదని, చట్టబద్ధమైన 22–ఎ భూములను మరింత బలంగా రక్షించాలంటే ముందుగా 22–ఎ జాబితానే ఖచ్చితంగా ఉండాలన్నారు. ఆధారం లేని, తప్పుగా వర్గీకరించబడిన, అధిక విస్తీర్ణంతో చేర్చబడిన లేదా తరువాతి కోర్టు, ప్రభుత్వ నిర్ణయాలతో విరుద్ధంగా ఉన్న నమోదులను గుర్తించి చట్టబద్ధమైన ప్రక్రియ ద్వారా సరిచేయాలని చెప్పారు.ములుగు జిల్లాలో భూములకు సంబంధించిన అన్ని ప్రభుత్వ రికార్డులను సమన్వయం చేసి ఆథెంటికేటెడ్ ములుగు డిస్ట్రిక్ట్ మాస్టర్ ల్యాండ్ డేటాబేస్‌ను రూపొందించి ప్రజలకు అందుబాటులో ఉంచాలని భాజపా నేత శ్యాంప్రసాద్ పటేల్ డిమాండ్ చేశారు. ములుగు జిల్లాలో మొత్తం భూమి ఎంత, అందులో వ్యవసాయ భూమి ఎంత, ఆపరేషనల్ హోల్డింగ్స్ ఎంత, వాస్తవంగా సాగులో ఉన్న భూమి ఎంత, ఆర్ఓఆర్, పట్టాదారు పాస్‌బుక్ పూర్తయిన భూమి ఎంత, రికార్డులు సవరించాల్సిన భూమి ఎంత, ప్రభుత్వ, అటవీ, ఆర్ఓఎఫ్ఆర్, సీలింగ్, అసైన్డ్ భూములు ఎంత, 22–ఎలో ఉన్న భూమి ఎంత, ప్రతి వర్గీకరణకు చట్టపరమైన ఆధారం ఏమిటి అనే ప్రశ్నలకు ప్రభుత్వం ఒకే ప్రామాణిక డేటాబేస్ ఆధారంగా సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తన వద్ద ఉన్న వివిధ డేటాబేస్‌లను పరస్పరం పోల్చి, భూ రికార్డుల వైరుధ్యాలను తొలగించి, ప్రతి సర్వే నంబర్‌కు ఒక స్పష్టమైన, ధృవీకరించిన, చట్టబద్ధమైన స్థితిని నిర్ధారించాలని, ప్రభుత్వ రికార్డులలోని వైరుధ్యాలను పరిష్కరించకుండా వాటి ఆధారంగా పౌరుల భూములను 22–ఎలో చేర్చడం లేదా కొనసాగించడం పునఃపరిశీలించాల్సిన అంశమని ప్రముఖ న్యాయవాది శ్యాంప్రసాద్ పటేల్ అన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాలని, అదే సమయంలో నిజమైన భూ హక్కుదారులను కూడా కాపాడాలని, ములుగు జిల్లా భూ రికార్డులపై సమగ్ర శ్వేతపత్రం విడుదల చేసి, అన్ని రికార్డులను ప్రక్షాళన చేసి, ఒకే ప్రామాణికమైన భూ డేటాబేస్‌ను ప్రజల ముందుంచాలని ఆయన డిమాండ్ చేశారు.

# అవంతి కళాశాలలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

### బ్రహ్మకుమారీస్ సోదరీమణులచే రాఖీ బంధనం

### నిస్వార్థ సేవలను కొనియాడిన చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు

**హైదరాబాద్ ఆగస్టు 27(పిసిడబ్ల్యూ న్యూస్):** బర్కత్‌పురలోని అవంతి డిగ్రీ & పీజీ కళాశాలలో రక్షాబంధన్ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాల నడుమ గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ సిస్టర్ సుమలత, సిస్టర్ వసంత విచ్చేశారు. ఈ సందర్భంగా వారు




కళాశాల ప్రిన్సిపాల్, హెచ్ఆర్ డైరెక్టర్, యాజమాన్య ప్రతినిధులు మరియు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి రాఖీలు కట్టి, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం వారు ప్రసంగిస్తూ రక్షాబంధన్ కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, అది రక్షణ, ఆత్మ పవిత్రత మరియు విశ్వ సోదరభావానికి సజీవ ప్రతీక అని వివరించారు.కళాశాల చైర్మన్, ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి ఎం. శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సమాజంలో నైతిక విలువలు, శాంతి మరియు ఆధ్యాత్మికతను పెంపొందించడంలో బ్రహ్మకుమారీస్ సంస్థ అందిస్తున్న నిస్వార్థ సేవలను ఆయన విశేషంగా కొనియాడారు. అనంతరం సమాజ శ్రేయస్సుకై ఆధ్యాత్మిక మార్గదర్శనం చేస్తున్న బ్రహ్మకుమారీస్ ప్రతినిధులను కళాశాల యాజమాన్యం తరఫున ఘనంగా సత్కరించారు.ఈ వేడుకలతో కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణంతో పాటు ఆధ్యాత్మిక భావన వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బీసీల హక్కుల కోసం ఐక్య పోరాటం అవసరం

- కులగణనతోనే బీసీలకు న్యాయమైన వాటా సాధ్యం
- పద్మశాలి సర్పంచుల అభినందన సభలో ఐఏఎస్ పరికిపండ్ల నరహరి






**హైదరాబాద్ ఆగస్టు 27(పిసిడబ్ల్యూ న్యూస్):** బీసీల హక్కులు, జనాభా ప్రాతిపదికన వారికి దక్కాల్సిన వాటా కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ప్రముఖ రచయిత పరికిపండ్ల నరహరి అన్నారు. గురువారం బిసి జనాధికార సమితి , బీసీ సమాజ్ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల ఎన్నికల్లో గెలుపొందిన పద్మశాలి సామాజిక సర్పంచుల అభినందన సభ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇదే కార్యక్రమంలో బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులను సమగ్రంగా చర్చిస్తూ ప్రముఖ రచయిత ఐఏఎస్ నరహరి రూపొందించిన 'బీసీ పోరుబాట2 పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ మాజీ ఐఏఎస్ చిరంజీవులు, రిటైర్డ్ డిజిపి పూర్ణచందర్ రావు, జనసేన తెలంగాణ అధికార ప్రతినిధి మోలికుంట్ల సాగర్, మాజీ ఎమ్మెల్యే అనిల్,బీసీ జనాధికార సమితి అధ్యక్షులు చీరాల నారాయణ,బీసీ సమాజ్ అధ్యక్షులు సంగెం సూర్య రావు, తదితరులతో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నరహరి మాట్లాడుతూ.. దేశంలో ఓబీసీల జనాభా, వారి సామాజిక పరిస్థితులపై స్పష్టమైన గణాంకాలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కులగణన ద్వారా బీసీల వాస్తవ జనాభా, వారి వెనుకబాటుతనం, విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం తదితర అంశాలపై స్పష్టత వస్తుందని తెలిపారు.జనాభాలో పెద్ద సంఖ్యలో ఉన్న బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో తగిన ప్రాతినిధ్యం లభించాల్సి ఉందన్నారు. బీసీల సమస్యలు కేవలం రిజర్వేషన్లకే పరిమితం కాకుండా ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారతతో ముడిపడి ఉన్నాయని వివరించారు.బీసీ సమాజం తమ హక్కుల కోసం సంఘటితంగా ముందుకు సాగాలని, వివిధ బీసీ కులాలు పరస్పర విభేదాలను పక్కనపెట్టి ఉమ్మడి లక్ష్యంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో బీసీల ప్రాతినిధ్యం పెరగడం, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీ లాకు 67 శాతానికి పెంచాలని తెలిపారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ ని సైంటిఫిక్ గా పరిశి పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని అన్నారు.జనాభా ప్రాతిపదికన న్యాయమైన వాటా సాధించడం కోసం నిరంతర ఉద్యమం అవసరమని అన్నారు.బీసీ పోరుబాట2'లో బీసీల సమస్యలు, వారి హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, కులగణన తదితర అంశాలను చర్చించినట్లు తెలిపారు. పుస్తకం బీసీ సమాజంలో చైతన్యం తీసుకురావడంతో పాటు హక్కుల సాధనకు దిశానిర్దేశం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో, బీసీ జనాధికార సమితి జనరల్ సెక్రటరీ కృష్ణమూర్తి, కోశాధికారి కీర్తి నాగార్జున, సభ్యులు పరికిపండ్ల సుమంత్, రామ్ ,వివర్స్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్, జాతీయ బీసీ సంఘం ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, హ్యాండ్లూమ్స్ చైర్మన్ వెంకట్రామన్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా రాజకీయ తరగతులను జయప్రదం చేయండి

**తల్లాడ, ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథ) ఖమ్మం జిల్లారాజకీయ శిక్షణ తరగతులు జయప్రదం చేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ వైరా డివిజన్ కార్యదర్శి షేక్ లాల్మియా పిలుపునిచ్చారు. తల్లాడ పట్టణంలో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో వారి పాల్గొని ప్రసంగిస్తూ దేశంలో మతోన్మాద శక్తులు పెట్రేగిపోతున్న ఈ సమయంలో పాసిజానికి వ్యతిరేకంగా కార్మికులు కర్షకులు పోరాడాల్సిన అవసరం ఉందని కార్యకర్తలను చైతన్యపరిచే విధంగా ఈ తరగతులు నిర్వహిస్తున్నామని ఈనెల 29, 30 తేదీలలో తిరుమలాయపాలెం మండలం ఎం వెంకటపాలెం గ్రామంలో నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. దేశ ప్రధాని కార్పొరేట్లకు దాసోహం అయి పేదలను, అన్నీ వర్గాల ప్రజల వంచిస్తూ ధగా చేస్తున్నాడాన్నారు. గుజరాత్ వ్యాపారుల లాభలే ముఖ్యంగా ఆదాని, అంబానీ లకు దోచి పెట్టడమే లక్ష్యంగా పని చేస్తున్నాడన్నారు. కార్మికుల హక్కుల కాలారస్తు ఉన్నచాట్టాలను రద్దు చేసి 4లేబర్ కోడ్లను తెచ్చి కార్మికలకు సమ్మె హక్కు లేకుండా చేయడం ఎవరి మేలు కోసం అని, అది కార్పిరెట్లకు కార్మికులను బానీషా లు మార్చడమే అన్నారు. రైతాంగాన్ని పూర్తిగా బలి చేస్తు వ్యవసాయరంగాన్ని ఆదానికి కట్టబెడుతున్నాడన్నారు. ఎం.ఎస్.పీ చట్టం చేయాలనీ, రైతువ్యతిరేక చట్టాలను రైతులు సంవత్సరం పొడవున ఢిల్లీ వేదిక గా పోరాడితే కేంద్రం వ్రాత పూర్వకంగా ఇచ్చిన హామీని ఇప్పటికి నెరవేర్చక పోవడం




సిగ్గుచెటు అన్నారు. యువకులు ఢిల్లీ వేదిక గా జెన్ జీ ఉద్యమం చేపట్టారని కేంద్రంకు తగిన బుద్ధి చెప్పారన్నారు. దీనితో మోడీ గ్రాఫ్ రోజు రోజు పడిపోతుంది అన్నారు. కార్యకర్తలు నీటిలో చేపల ప్రజల్లో మమేకం కావాల్సిన అవసరం ఉందని వారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడలని అయన పిలుపును ఇచ్చారు. వ్యవసాయ రంగం లో సంక్షోభం తీవ్రంగా ఉంది అని కేంద్రం వ్యవసాయ మోటలకు మీటర్లు పెట్టి ఆదానికి వ్యవసాయ రంగాన్ని కట్టబేడుతున్నారు అన్నారు. పోరాటాల ద్వారానే కేంద్ర నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా పోరాడుదాం అని అందుకు ప్రజలు సిద్ధం కావాలి అని అయన అన్నారు. దేశంలో నిత్యావసర ధరలు పెంచి సామాన్యులకు పెనుబారం మోపుతున్నారని పోరాడితేనే మనం బతికే రోజులు ఏర్పడ్డయని అయన అన్నారు. ఈ సమావేశంలో తల్లాడ ఏన్మార్ సంయుక్త మండల కార్యదర్శి కే వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి డి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు పటాన్ నాగుల్ మీరా, డి రమణ, జీ పుల్లమ్మ, ఎస్ కే జానీ, వీరభద్రం, వెంకులు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# శిశు మందిర్ పాఠశాలలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు





**కరీంనగర్,ఆగస్టు27 (పీసీడబ్ల్యూ న్యూస్):** శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ముందస్తు రాఖీ పౌర్ణమి సందర్భంగా పౌర్ణమి యజ్ఞం, రాఖీ ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు యజ్ఞంలో పాల్గొని వేద మంత్రోచ్చారణల మధ్య హవన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ రక్షాబంధన్ అన్నాచెల్లెళ్ల ఆత్మీయత, పరస్పర ప్రేమ, రక్షణ భావానికి ప్రతీక అని విద్యార్థులకు వివరించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, సోదరభావం, దేశభక్తి వంటి విలువలను విద్యార్థుల్లో పెంపొందించడమే ఇలాంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ తెలిపారు.యజ్ఞం అనంతరం విద్యార్థులు పరస్పరం రాఖీలు కట్టుకుని రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. దీంతో పాఠశాల ఆవరణం భక్తి, ఆనందోత్సాహాలతో కళకళలాడింది.కార్యక్రమంలో కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, డా. ఎలగందుల శ్రీనివాస్, కొణిజర్ల మహేష్, శిరీష, పులాల శ్యామ్, అల్లాడి ఆనంద్ కుమార్, ముసుకుల విద్యాసాగర్ రెడ్డి, పండుగ నాగరాజు, టి. రాజేశ్వర్ రావు, అప్పిడి వకుళాదేవి తదితరులు పాల్గొన్నారు.

# నగునూరులో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

**- గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి: మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్**

**- మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం**





**కరీంనగర్,ఆగస్టు27 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నియోజకవర్గంలోని కరీంనగర్ రూరల్ మండలం నగునూరు గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఎస్‌జీఎఫ్ నిధులు రూ.10 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బుధవారం శంకుస్థాపన చేశారు. కరీంనగర్ ఫ్యాక్స్ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, సర్పంచ్ సాయిల్ల శ్రావణి మహేందర్‌లతో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. **ఘన స్వాగతం.. సమస్యలపై ఆరా** నగునూరుకు చేరుకున్న గంగుల కమలాకర్‌కు గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామస్థులతో సమావేశమైన ఎమ్మెల్యే గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాగునీరు, విద్యుత్ సమస్యలతో పాటు పలు వీధుల్లో సీసీ రోడ్ల అవసరం ఉందని ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన గంగుల కమలాకర్ తన నిధులతో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. **మల్లికార్జున స్వామి ఆలయానికి భూమిపూజ** అనంతరం గ్రామస్థులతో కలిసి ర్యాలీగా వెళ్లిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నూతనంగా నిర్మిస్తున్న మల్లికార్జున స్వామి ఆలయానికి ప్రత్యేక పూజలు నిర్వహించి భూమిపూజ చేశారు. ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయంగా రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. గ్రామ వీధుల్లో ప్రజలు పూలు చల్లి, శాలువాలతో సత్కరించి ఆయనకు తమ అభిమానాన్ని చాటుకున్నారు. **కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు** ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న పదేళ్లలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. అయితే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలుకు సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ ప్రజలను మభ్యపెట్టిందని ఆరోపించారు. ప్రజలను మోసం చేసిన ఏ ప్రభుత్వమైనా గద్దె దిగక తప్పదని, రానున్న రెండేళ్లలో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో మళ్లీ ప్రజలకు సుపరిపాలన అందిస్తామని పేర్కొన్నారు. ఉప సర్పంచ్ హనుమంతరావు, నాయకులు పాషా, రవితేజ, దిలీప్, భద్రయ్య, శ్రీనివాస్, సుదర్శన్‌రెడ్డి, రంగారెడ్డి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి పదవుల్లో మట్టా రాగమయి రాణించాలి

**• సత్తుపల్లి ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నాయకుల శుభాకాంక్షలు**



**కల్లూరు, ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :**రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్‌గా త్వరలో బాధ్యతలు స్వీకరించనున్న సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌కు కల్లూరు మండల కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టనున్న ఆమె మరింత సమర్థవంతంగా సేవలందిస్తూ మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు బైర్ల కాంతారావు, తందు రాములు, ఎండీ అయూబ్, కంభంపాటి పుల్లాచారి, కుంచాల గురవయ్య, ఉబ్బన కరుణాకర్ తదితరులు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌ను అభినందించారు.

# నేదునూర్ పాఠశాలలో రక్షా బంధన్ కార్యక్రమం...





**తిమ్మాపూర్ ఆగస్టు 27(పిసిడబ్ల్యూ న్యూస్):** తిమ్మాపూర్ మండలం లోని నేదునూర్ జడ్పి పాఠశాల లో గురువారం రక్షా బంధన్ ముందస్తు వేడుకలను నిర్వహించినట్లు హెచ్ ఎం లక్ష్మణ్ రావు తెలిపారు. విద్యార్థి-విద్యార్థునుల్లో ఒకరికొకరు రక్ష అనే భావాన్ని విస్తృత పర్చాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహిం చినట్లు తెలిపారు.మొక్కలను కూడా సంరక్షించే బాధ్యతకూడా పెరిగేలా మొక్కలకు కూడా రాఖీలను కట్టించినట్లు, రాఖీ లను సమకూర్చిన బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు.ఉపాధ్యాయ బృందం,సిబ్బంది, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కొత్తపల్లిలో ఓటరు జాబితాపై సమీక్ష

**కరీంనగర్,ఆగస్టు27 (పీసీడబ్ల్యూ న్యూస్):**
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కొత్తపల్లి వార్డు కార్యాలయంలో 17, 18వ డివిజన్ల ఓటరు జాబితాపై జీపీఓ దుర్గ ప్రసాద్ కాంగ్రెస్, బీజేపీ బీఎల్ఏలు, బీఎల్ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో 17, 18వ డివిజన్‌ల కార్పొరేటర్లు వేముల కవిత, వాసాల రమేష్తో పాటు కాంగ్రెస్ నాయకులు గడ్డం శ్రీనివాస్, దుబ్బసి కుమార్, బీజేపీ నాయకులు స్వర్గం నర్సయ్య, పేంటీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.ఇప్పటివరకు రెండు డివిజన్ల పరిధిలో 2,121 ఓట్లు తొలగించినట్లు అధికారులు తెలిపారు. తొలగించిన ఓట్లకు సంబంధించి ఆయా ఓటర్లకు నోటీసులు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన ఓటర్లు తమకు అందిన నోటీసులకు స్పందించి, అవసరమైన పత్రాలను సమర్పించి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని సూచించారు.



# జర్నలిస్టుల పాదయాత్రతో ప్రభుత్వం కళ్లు తెరవాలి







**- హామీలు ఇచ్చి అమలు చేయకుండా జర్నలిస్టులను వాడుకోవడం దుర్మార్గం**

**- జర్నలిస్టుల పాదయాత్ర చరిత్రాత్మకం**

**- ప్రభుత్వం జర్నలిస్టులకు స్థలాలు ఇవ్వకుంటే జర్నలిస్టులతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం**

**- రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు**

**- జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే : కాంగ్రెస్ పార్టీ నాయకులు**



**ఖమ్మం/పెనుబల్లి, ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జర్నలిస్టుల పాదయాత్రతో ప్రభుత్వం కళ్ళు తెరిచి జర్నలిస్టులకి ఇచ్చిన హామీమేరకు ఇళ్ల స్థలాలను వెంటనే ఇవ్వాలని టిఆర్ఎస్, సిపిఎం, బిజెపి, తెలుగుదేశం, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్, ఎమ్మార్పీఎస్, పౌర హక్కుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో పాలేరు నియోజకవర్గంలో జూలై 22న ప్రారంభమైన జర్నలిస్టుల పాదయాత్ర, 25న వైరా ముగించుకొని, 27న సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడ, కల్లూరు మండలాలతో పాటు గురువారం పెనుబల్లి మండలానికి చేరుకుంది. మండల కేంద్రంలో గల గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించాలి. అనంతరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నల్లమల ప్రతాప్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్, సిపిఎం, టిడిపి, బిఎస్పి, ఎమ్మార్పీఎస్, పౌర హక్కుల సంఘం తదితర నాయకులు, మాజీ జడ్పిటిసి చెక్కిలాల మోహన్ రావు లు మాట్లాడారు. జర్నలిస్టుల పాదయాత్రతో ప్రభుత్వం కళ్లు తెరవాలని, జర్నలిస్టులకు ఇచ్చిన ఇళ్ల స్థలాల హామిని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించే జర్నలిస్టులు తమ సమస్యలు పరిష్కరించాలని రోడ్డు ఎక్కి పాదయాత్ర చేయటం దారుణం అన్నారు. జర్నలిస్టులను ఇబ్బందులకు గురిచేసి మనుగడ సాధించిన ప్రభుత్వాలు ఏమీ లేవని, తక్షణమే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, జర్నలిస్టులతో కలిసి పోరాటాన్ని ఉధృతం చేసి వారి హక్కుల సాధనలో భాగస్వాములు అవుతామని హామీ ఇచ్చారు. పెల్లి పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నల్లమల ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ... జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యని ఒక బాధ్యతగా చేపట్టిన టిడబ్ల్యూజేఎఫ్ నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియ జేశారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య ప్రతి ఒక్కరి దని యూనియన్ల కతీతంగా జర్నలిస్టులందరూ సమస్య సాధనకు ఐకమత్యంగా కదిలి రావాలని పిలుపుని చ్చారు. జర్నలిస్టుల సమస్య అందరిది అయినప్పుడు యూనియన్లు కూడా బాధ్యతగా ముందుకొచ్చి ఐకమత్యంతో ఇళ్ల స్థలాలు సాధించుకోవడం సులభతరం అవుతుందన్నారు. పెనుబల్లి మండలంలో ఇండ్ల స్థలాల కోసం కొన సాగుతున్న జర్నలిస్టుల పాదయాత్ర సందర్భంగా టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా నాయకులకు భద్రాద్రి కొత్తగూడెం నుండి వచ్చిన సీనియర్ జర్నలిస్టులు తోకల శ్రీనివాస్, పూనేం ప్రదీప్, రవి, నాగేంద్ర, రాజు, అన్వేష్ రెడ్డి, అనిల్ లు తమ సంపూర్ణ సంఘీభావాన్ని తెలియజేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దేనని.. తప్పకుండా జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చే దానిలో మా మంత్రులు, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకువెళ్లి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల పాదయాత్ర కార్యక్రమంలో... సిపిఎం జిల్లా నాయకులు చలమాల విఠల్రావు, గాయం తిరుపతిరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పంది వెంకటేశ్వర్లు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు మంగ చంద్రశేఖర్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు మాలోత్ రాధాకృష్ణ, బిఆర్ఎస్ నాయకులు మందడపు అశోక్ కుమార్, టిడిపి మండల అధ్యక్షులు తుమ్మలపల్లి రాజేశ్వరరావు, బిజెపి నాయకులు బొర్ర నరసింహా రావు, బిఆర్ఎస్ నాయకులు, మాజీ జెడ్పిటిసి సీనియర్ జర్నలిస్ట్ చెక్కిలాల మోహన్రావు, పౌర హక్కుల సంఘం జిల్లా నాయకులు శ్రీనివాసరావు, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు రావూరి రమేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కొలికపోగు వెంకటేశ్వర్లు, ఈ జర్నలిస్టుల పాదయా త్రలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి .రాజశేఖర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, టిబిజేఏ జిల్లా కార్యదర్శి మానుకొండ రవికిరణ్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ నలబోల మధుశ్రీ, బాలకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.ఎస్ చక్రవర్తి, సీనియర్ జర్నలిస్ట్ మారెడ్డి నాగేందర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, కొరకొప్పుల రాంబాబు, టిబీజేఏ కెమెరామెన్స్ జిల్లా కార్యదర్శి భూక్య గణేష్, అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ అర్షద్, యూసూఫ్, నాయకులు గంగుల గోపి, మందా శరత్, చిర్రా పవన్, పెరుమాళ్ళపల్లి నాగార్జున పాల్గొన్నారు.

# కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

## పత్తికొండలో న్యాయవాదుల బైక్ ర్యాలీ






**పత్తికొండ ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాయలసీమ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడంతో పాటు డివిజన్ కేంద్రమైన పత్తికొండలో సబ్‌కోర్టును ఏర్పాటు చేయాలని పత్తికొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. మధుబాబు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం గురువారం పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుబాబు ఆధ్వర్యంలో స్థానిక అతిథి గృహం నుంచి నాలుగు స్తంభాల కూడలి వరకు బైక్ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ.. 2014లో జరిగిన శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమ ముఖద్వారమైన కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హోసూరు పర్యటన సందర్భంగా 90 రోజుల్లో కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకొస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల ప్రజలు సుదూర ప్రాంతంలో ఉన్న హైకోర్టుకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించి కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కోరారు. లేకుంటే రాయలసీమ జేఏసీ పిలుపు మేరకు వివిధ దశల్లో నిరసనలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. అదేవిధంగా పత్తికొండ డివిజన్ కేంద్రంలో ఆర్డీవో, డీఎస్పీ కార్యాలయాలు ఉన్నప్పటికీ సబ్‌కోర్టు లేకపోవడంతో న్యాయవాదులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పత్తికొండలో సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయవాదులు మల్లికార్జున, రవిప్రకాష్, నారాయణస్వామి, సురాజ్‌నబి, రంగస్వామి, రవి, జగదీష్, నెట్టేకల్లు, నరసింహులు, వాసు, సుధాకృష్ణ, భాస్కర్, రాజశేఖర్, అలీ, వీరేష్, మధు, నాగరాజు, నాగభూషణం, శ్రీను, రామంజి, బషీర్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రసాద్ ను సన్మానించిన నూతి సత్యనారాయణ గౌడ్



**తల్లాడ, ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా మీడియా అధ్యక్షుడిగా ఎన్నికైన నారపోగు ప్రసాద్ ను కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ సన్మానించారు. గురువారం తల్లాడకు వచ్చిన ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రసాద్ ను శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియా అధ్యక్షులుగా ప్రసాద్ ఎంపిక కావడం అభినందనీయమని, ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా మీడియా ఉండాలని సూచించారు. అనంతరం నూతి సత్యనారాయణ గౌడ్ కు ప్రసాద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలోమండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మీ రెడ్డి , జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాస రావు , ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు, కల్లూరు టౌన్ ఇంచార్జ్ కోసూరు వెంకటేశ్వర్లు (కె.వి), మాజీ జెడ్పీటీసి ఎం. ప్రసాద్, వెంకటరమణారెడ్డి, మండలం ఉపాధ్యక్షులు తాళ్ల జోసెఫ్, తుమ్మలపల్లి రమేష్ దాసరి శ్రీనివాసరావు, మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేరుశనగ విత్తనాల అక్రమ విక్రయాలపై విచారణ జరపాలి

## 3 వేల క్వింటాళ్లు అక్రమంగా అమ్మారని ఆరోపణ

## బాధ్యులపై చర్యలు తీసుకోవాలి..!

## ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.రామచంద్రయ్య




**పత్తికొండ ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కర్నూలు జిల్లాలో రైతులకు 100 శాతం సబ్సిడీపై ఉచితంగా పంపిణీ చేయాల్సిన విశిష్ట వేరుశనగ కాయలు (విత్తనాలు) సుమారు 3 వేల క్వింటాళ్లను వ్యవసాయ శాఖ అధికారులు అక్రమంగా విక్రయించి, రూ.30 కోట్లకు పైగా అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. గురువారం పత్తికొండలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక నాలుగు స్తంభాల కూడలి వద్ద సభ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రామచంద్రయ్య మాట్లాడుతూ, రైతులకు పూర్తిగా ఉచితంగా అందించాల్సిన వేరుశనగ విత్తనాలను జిల్లాలో సక్రమంగా పంపిణీ చేయకుండా కొందరు అధికారులు అక్రమంగా విక్రయించారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం 2025 ఖరీఫ్, రబీ సీజన్లతో పాటు 2026 ఖరీఫ్ సీజన్‌కు రైతుల కోసం 100 శాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను సరఫరా చేసిందని తెలిపారు. అయితే వాటి పంపిణీపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు తగిన సమాచారం ఇవ్వలేదని విమర్శించారు. జిల్లా, మండల స్థాయి అధికారులు, అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై విత్తనాలను అక్రమంగా విక్రయించారని ఆరోపించారు. ఆదోని, ఆలూరు, ఆస్పరి, దేవనకొండ, గూడూరు, హాలహర్వి, హొళగుంద, కోసిగి, కృష్ణగిరి, మద్దికెర, మంత్రాలయం, పత్తికొండ, పెద్దకడుబూరు, తుగ్గలి, వెల్దుర్తి, ఎమ్మిగనూరు తదితర మండలాల్లో ఈ అక్రమాలు జరిగినట్లు ఆరోపించారు. సుమారు 3 వేల క్వింటాళ్ల విత్తనాలు రైతులకు అందకుండా పోయాయని, వాటి విలువ రూ.30 కోట్లకు పైగా ఉంటుందని పేర్కొన్నారు. ఇంత పెద్ద మొత్తంలో అవినీతి ఆరోపణలు వచ్చినప్పటికీ ఇప్పటివరకు బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. గ్రామస్థాయిలో నామమాత్రపు విచారణలు నిర్వహిస్తూ రైతులపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. వెంటనే సమగ్ర విచారణ చేపట్టి అక్రమంగా విక్రయించిన విత్తనాల సొమ్మును రికవరీ చేయాలని, అక్రమాలకు పాల్పడిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధ్యులైన వ్యవసాయ శాఖ అధికారులను సస్పెండ్ చేసి విధుల నుంచి తొలగించాలని కోరారు. ధర్నాకు రైతు సంఘం పత్తికొండ నియోజకవర్గ సమితి కార్యదర్శి బి. సురేంద్రకుమార్ అధ్యక్షత వహించారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. తిమ్మయ్య, రైతు సంఘం నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు ఎం. కారన్న, సీపీఐ మండల కార్యదర్శి యు. కారుమంచి, పట్టణ కార్యదర్శి ఎన్. రామాంజినేయులు, తాలూకా సీనియర్ నాయకుడు ఆర్. గురుదాసు, మండల సహాయ కార్యదర్శి జె. కాశీం, యువజన సమాఖ్య నాయకుడు ఉపేంద్ర, సీపీఐ పట్టణ నాయకులు ఎం.కె. సుంకన్న, ఎం. శ్రీనివాసులు, నాగేంద్ర, జి. బాషా, మాదన్న, లక్ష్మన్న, ఉరుకుందు, వీరేష్‌లు పాల్గొన్నారు. అనంతరం డిప్యూటీతహసీల్దార్‌శ్రీదేవికివినతిపత్రం సమర్పించారు.

# జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చి తీరుతాం..

## - సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్

## - టీడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో సత్తుపల్లికి చేరిన పాదయాత్ర బృందానికి సంఘీభావం తెలిపి హామీ ఇచ్చిన ఎమ్మెల్యే







**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం జిల్లా, సత్తుపల్లి ప్రాంతంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చి తీరుతాం అని, వారి న్యాయమైన డిమాండ్ ను నెరవేరుస్తామని, స్థలాన్ని కూడా పరిశీలిస్తున్నామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. గురువారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఇండ్ల స్థలాల సాధన పాదయాత్ర గురువారం సత్తుపల్లి నియోజకవర్గ కేంద్రానికి చేరుకుంది. ఈ నెల 22వ తేదీన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నియోజకవర్గమైన పాలేరు ప్రాంతంలో గల తిరుమలాయపాలెం మండలం, సుబ్లేడు గ్రామంలో అమర జర్నలిస్ట్ సోయాబుల్లాఖాన్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం ఆయన పోరాట స్ఫూర్తితో అక్కడనుండి ప్రారంభమైన ఈ పాదయాత్ర తిరుమలాయపాలెం మండలం, కూసుమంచి, నేలకొండపల్లి ప్రాంతాలలో పాదయాత్ర జరుగగా, 25వ తేదీన రెండవ విడత ప్రారంభమైన పాదయాత్ర వైరా నియోజకవర్గంలో కారేపల్లి, కామేపల్లి, ఏన్కూరు, వైరా, కొనిజర్ల మండల కేంద్ర ప్రాంతాలలో పాదయాత్ర విజయవంతంగా జరిగింది. ఈనెల 27వ తేదీన సత్తుపల్లి నియోజకవర్గంలో గల తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి మండల కేంద్రంలో ఈ పాదయాత్ర ఘనంగా ముగిసింది. ఈ పాదయాత్రకు స్థానిక శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సంఘీభావం తెలిపి ప్రసంగించారు. సత్తుపల్లి ప్రాంతంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇచ్చి తీరుతామని, ఇప్పటికే స్థల పరిశీలన జరిగిందని ఆమె అన్నారు. జర్నలిస్ట్ ల ఇండ్ల స్థలాల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో పలు దఫాలుగా చర్చించామని, వారు సానుకూల దృక్పథంతో ఉన్నారని పేర్కొన్నారు. ఈ మేరకు జర్నలిస్టు సంక్షేమం కోసం కూడా తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె పేర్కొన్నారు. అనంతరం యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టీఎస్ చక్రవర్తి, రాష్ట్ర నాయకులు నాగేందర్ రెడ్డి, మధుశ్రీ, జిల్లా నాయకులు మానుకొండ రవికిరణ్, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, కొరకొప్పుల రాంబాబు లు మాట్లాడుతూ.. అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వ హామీ మేరకు ఇళ్లస్థలాలు దక్కేవరకు తమ పోరాటం ఆపేది లేదని వారు స్పష్టం చేశారు. తమ పాదయాత్ర ప్రభుత్వాన్ని మేలుకొలిపే విధంగానే కొనసాగుతుందని, ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పాదయాత్ర ఏ పార్టీకి అనుకూలము కాదు, వ్యతిరేకము కాదు అని తెలిపారు. తమ పాదయాత్రకు మద్దతుగా వచ్చిన పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, యూనియన్లకు అతీతంగా విచ్చేసి మద్దతు తెలిపిన జర్నలిస్ట్ నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిబిజేఏ జిల్లా కార్యదర్శి మానుకొండ రవికిరణ్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ నలబోల మధుశ్రీ, బాలకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.ఎస్ చక్రవర్తి, సీనియర్ జర్నలిస్ట్ మారెడ్డి నాగేందర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, కొరకొప్పుల రాంబాబు, పీజీబీఏ కెమెరామెన్స్ జిల్లా కార్యదర్శి భూక్య గణేష్, అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ అర్షద్, యూషూఫ్, నాయకులు గంగుల గోపి, మందా శరత్, చిర్రా పవన్, పెరుమాళ్ళపల్లి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ సంస్థలతో స్థానిక వ్యాపారులకు నష్టం..!

## స్థానిక వ్యాపారులను ప్రోత్సహిస్తేనే ప్రొద్దుటూరు ఆర్థికంగా బలోపేతం: మాజీ ఎమ్మెల్యే రాచమల్లు



**ప్రొద్దుటూరు ఆగస్టు 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రొద్దుటూరు పట్టణం ఏర్పడిన నాటి నుంచి గొప్ప వాణిజ్య కేంద్రంగా పేరుగాంచిందని, వస్త్ర, బంగారు, కాటన్, ఆయిల్ తదితర వ్యాపార రంగాల్లో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక దొరసానిపల్లెలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొంతకాలంగా ప్రొద్దుటూరులో అన్ని రకాల స్థానిక వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలు, షాపింగ్ మాల్స్ రావడం వల్ల స్థానిక వ్యాపారాలపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. ముఖ్యంగా పండుగల సమయంలో ఇతర ప్రాంతాల నుంచి వ్యాపార సంస్థలు వచ్చి ఆకర్షణీయమైన ఆఫర్లు ఇవ్వడం వల్ల స్థానిక వ్యాపారులకు వ్యాపారం తగ్గిపోతోందని తెలిపారు. స్థానిక వ్యాపారులు పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టడంతో పాటు, ప్రజలకు అరువు, గ్యారంటీ, రీప్లేస్‌మెంట్ వంటి సదుపాయాలు కల్పిస్తూ ఎన్నో ఏళ్లుగా వినియోగదారులకు అండగా నిలుస్తున్నారని రాచమల్లు పేర్కొన్నారు. అలాంటి వ్యాపారులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. తాను కార్పొరేట్ సంస్థలకు వ్యతిరేకమని స్పష్టం చేసిన రాచమల్లు, ప్రొద్దుటూరులోని కొన్ని షాపింగ్ మాల్స్ ప్రారంభ సమయంలో మంచి స్టాక్, ఆకర్షణీయమైన ఆఫర్లతో వినియోగదారులను ఆకట్టుకున్నప్పటికీ, ప్రస్తుతం డెడ్ స్టాక్‌ను విక్రయిస్తున్నారనే అభిప్రాయాలు ప్రజల్లో ఉన్నాయని అన్నారు. వ్యాపారం తగ్గితే సిబ్బందిని తగ్గించే పరిస్థితి వస్తుందని, చివరికి నష్టపోయేది స్థానికులేనని వ్యాఖ్యానించారు. ప్రొద్దుటూరులో చందనాస్ వంటి కార్పొరేట్ సంస్థలు ఏర్పాటు కావడం వల్ల స్థానిక బంగారు వ్యాపారులు, స్వర్ణకారులు, కార్మికులపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. పట్టణంలో బంగారు వ్యాపారంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 5 నుంచి 6 వేల మంది జీవనం సాగిస్తున్నారని తెలిపారు.

స్థానిక బంగారు వ్యాపారులు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే ధరల్లో వస్తువులు అందించడంతో పాటు, అరువు, రీప్లేస్‌మెంట్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నారని చెప్పారు. అదే విధంగా నాయీబ్రాహ్మణులు ఎన్నో ఏళ్లుగా తమ వృత్తిని నమ్ముకుని ఆధునిక సౌకర్యాలతో షాపులను ఏర్పాటు చేసు కుంటున్నారని, బయట ప్రాంతాల నుంచి వచ్చే కార్పొరేట్ సంస్థలు స్థానికుల వృత్తి, ఉపాధిపై ప్రభావం చూపే అంశాన్ని కూడా ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో ఎలక్ట్రికల్, స్టీల్ సామాన్ల రంగంలో కూడా కార్పొరేట్ సంస్థలు ప్రొద్దుటూరులో ఏర్పాటు కానున్నట్లు సమాచారం ఉందని రాచమల్లు తెలిపారు. స్థానిక వ్యాపారులను ప్రజలు, ప్రభుత్వం ప్రోత్సహించాలని కోరారు. "కార్పొరేట్ సంస్థలు ఇక్కడి ప్రజల డబ్బుతో వ్యాపారం చేసి ఆ ఆదాయాన్ని ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తాయి. స్థానిక వ్యాపారులను ప్రోత్సహిస్తే ప్రొద్దుటూరు ఆర్థికంగా బలోపేతం అవుతుంది.

కార్పొరేట్ సంస్థలను విచ్చలవిడిగా ప్రోత్సహిస్తే ఆర్థిక వలస విధానాన్ని ప్రోత్సహించినట్లే" అని ఆయన వ్యాఖ్యానించారు. డీమార్ట్ వంటి సంస్థలతో పోలిస్తే స్థానిక వ్యాపారులు కూడా అనేక వస్తువులను సమాన ధరలకు విక్రయిస్తున్నారని, ప్రజలు స్థానిక వ్యాపారుల నుంచి కొనుగోళ్లు చేయడం ద్వారా పట్టణ ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇచ్చినవారవుతారని రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అన్నారు.




# టాక్సిక్‌పై మిక్స్‌డ్ టాక్

## భారీ నష్టాలు తప్పవంటూ సోషల్ మీడియా కూత

కేజీఎఫ్ స్టార్ యశ్ హీరోగా, దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' కు రిలీజ్‌కు ముందు భారీ అంచనాలు నెలకొనడంతో అడ్వాన్స్ బుకింగ్స్‌లో అదిరిపోయే స్పందన లభించింది. అయితే సినిమా విడుదలైన తర్వాత మాత్రం ప్రేక్షకులు, విమర్శకుల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. ప్రీమియర్ షోల నుంచే సినిమాపై డివైడ్ టాక్ మొదలైంది. అడ్వాన్స్ బుకింగ్స్ కారణంగా తొలి రోజు భారీ ఓపెనింగ్స్ నమోదైనప్పటికీ, దీర్ఘకాలంలో సినిమా బాక్సాఫీస్ వద్ద ఏ మేరకు నిలబడుతుందన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇదే సమయంలో 'టాక్సిక్' తెలుగు థియేట్రికల్ హక్కులను దక్కించుకున్న ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ దిల్ రాజుకు భారీ నష్టాలు తప్పవంటూ సోషల్ మీడియాలో ప్రచారం మొదలైంది. 'టాక్సిక్' సినిమాపై ప్రారంభం నుంచే భారీ బజ్ నెలకొంది. యశ్‌కు 'కేజీఎఫ్' సిరీస్ తర్వాత దేశవ్యాప్తంగా వచ్చిన క్రేజ్, సినిమా భారీ స్థాయిలో రూపొందడం, పాన్ ఇండియా రిలీజ్ వంటి అంశాలు బిజినెస్‌పై ప్రభావం చూపాయి. ఈ సినిమాపై ఉన్న నమ్మకంతో దిల్ రాజు తెలుగు హక్కులను దక్కించుకున్నారని ప్రచారం జరిగింది. ప్రీరిలీజ్ ఈవెంట్‌లోనూ సినిమాపై చిత్రబృందం చూపించిన విశ్వాసం భారీగా కనిపించింది. మ్యూజిక్ డైరెక్టర్ విశాల్ మిశ్రా ఈ సినిమా రూ.2,000 కోట్ల వసూళ్ల సామర్థ్యం ఉన్న ప్రాజెక్ట్ అని చెప్పినట్లు దిల్ రాజు ప్రస్తావించడం అప్పట్లో వైరల్ అయింది.ఆ నమ్మకంతోనే తెలుగు రాష్ట్రాల్లో 'టాక్సిక్'ను భారీ ఎత్తున థియేటర్లలో విడుదల చేశారు. కానీ విడుదలైన మొదటి రోజే టాక్ అంచనాలకు భిన్నంగా రావడంతో ఇప్పుడు బాక్సాఫీస్ రన్‌పై చర్చ సాగుతోంది.'టాక్సిక్'కు డివైడ్ టాక్ రావడంతో కొందరు నెటిజన్లు దిల్ రాజు భారీగా నష్టపోతారంటూ పోస్టులు పెడుతున్నారు. రూ.100 కోట్ల వరకు నష్టం వస్తుందని కూడా సోషల్ మీడియాలో లెక్కలు వైరల్ అవుతున్నాయి.

# రంగస్థలంను మించి

## మరోమారు సుక్కుతో రామ్‌చరణ్ జోడీ

టాలీవుడ్ నుంచి రాబోతున్న అత్యంత క్రేజీ ప్రాజెక్టుల్లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, స్టార్ దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా కూడా ఒకటి. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'రంగస్థలం' టాలీవుడ్‌లో ఎంతటి సంచలన విజయాన్ని నమోదు చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు ఈ హిట్ కాంబినేషన్ మరోసారి జతకట్టబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. రామ్ చరణ్ ఇటీవల 'పెద్ది'తో భారీ విజయాన్ని అందుకోగా, మరోవైపు సుకుమార్ 'పుష్ప 2'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనాత్మక విజయాన్ని నమోదు చేశారు. తమ తమ కెరీర్‌లో భారీ విజయాల తర్వాత ఈ ఇద్దరూ మరోసారి కలిసి పనిచేయబోతుండటం ఈ ప్రాజెక్ట్‌పై మరింత హైప్‌ను పెంచుతోంది. అంతేకాదు, 'రంగస్థలం' వంటి ఐకానిక్ సినిమాను అందించిన కాంబినేషన్ కావడంతో ఈసారి ఎలాంటి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తారనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. సుకుమార్ మార్క్



కథనం, రామ్ చరణ్ ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్ మరోసారి కలిస్తే బాక్సాఫీస్ వద్ద మరో భారీ సంచలనం నమోదవుతుందని అభిమానులు ఇప్పటికే అంచనా వేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై నిర్మాత రవి శంకర్ చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ కాంబినేషన్‌పై అభిమానులు ఎంతటి అంచనాలు పెట్టుకున్నా, వాటిని మించే స్థాయిలో సినిమా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేసినట్లు సమాచారం. సినిమా టైటిల్, కథాంశం, ఇతర నటీనటులు, టెక్నికల్ టీమ్‌కు సంబంధించిన వివరాలు ఎప్పుడు బయటకు వస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. అధికారిక ప్రకటన వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. తాజా టాక్ ప్రకారం, ఈ భారీ ప్రాజెక్ట్ షూటింగ్ ఈ ఏడాది నవంబర్ నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం రామ్ చరణ్, సుకుమార్ ఇద్దరూ తమ తమ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న నేపథ్యంలో, ఈ సినిమా షూటింగ్ షెడ్యూల్ ఎలా ఉండబోతుందనేది
కూడా ఆసక్తికరంగా మారింది.



## రకుల్ నోట శూర్పణఖ కథ.. తెలియని విషయాలు బయటపెట్టిన నటి!

రామాయణంలో శూర్పణఖ అంటే చాలామందికి వెంటనే గుర్తుకొచ్చేది ప్రతినాయకురాలి పాత్రే. కానీ, 'రామాయణ' చిత్రంలో తాను పోషిస్తున్న శూర్పణఖ పాత్రలో అంతకుమించిన కోణాలున్నాయని నటి రకుల్ ప్రీత్ సింగ్ చెప్పింది. ఆ పాత్రలోని అనేక అంశాలు తనను ఈ సినిమా వైపు ఆకర్షించాయని తెలిపింది.రావణుడి సోదరిగా శూర్పణఖ పాత్రలో రకుల్ కనిపించనుంది. లంకలో అత్యంత అందమైన మహిళల్లో ఆమె ఒకరని చెబుతారని రకుల్ గుర్తుచేసుకుంది. ఆమెకు అహంకారం ఉన్నప్పటికీ.. పాత్రలో చాలా కోణాలున్నాయని చెప్పింది. నటిగా అలాంటి పాత్రలను ఆవిష్కరించడం ఆసక్తికరంగా ఉంటుందని తెలిపింది. స్క్రిప్ట్ చదివే వరకు శూర్పణఖ జీవితం గురించి తనకు తెలియని విషయాలు చాలానే ఉన్నాయని రకుల్ చెప్పింది. లక్ష్మణుడు ఆమె ముక్కు కోసిన ఘటనకు ముందు, తర్వాత జరిగిన పరిణామాలను సినిమాలో కొత్త కోణంలో చూపిస్తున్నట్లు వెల్లడించింది. రాముడిని శూర్పణఖ ఎలా కలుస్తుందన్న విషయాల్లోనూ కొత్త అంశాలు తెలుసుకున్నానని తెలిపింది.రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్, సన్నీ డియోల్, రవి దూబే కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం భారీ అంచనాల మధ్య తెరకెక్కుతోంది. 'రామాయణ: పార్ట్-1' 2026 నవంబర్ 6న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## నటుడు నారాయణరావు కన్నుమూత



ప్రముఖ నటుడు జీవీ నారాయణ రావు (73) కన్నుమూశారు. ఆయన ఇకలేరనే విషాదకర వార్తను నటి కరాటే కల్యాణి సోషల్‌మీడియా వేదికగా వెల్లడించారు. నారాయణ రావు 100కు పైగా చిత్రాల్లో నటించారు. 1976లో కె.బాలచందర్ దర్శకత్వం వహించిన 'అంతులేని కథ' చిత్రంతో నటుడిగా పరిచయమైన ఆయన.. తొలి సినిమాకే ఉత్తమ సహాయ నటుడిగా నంది అవార్డు అందుకున్నారు. మద్రాస్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్న నారాయణరావు.. రజనీకాంత్, చిరంజీవిలకు మంచి మిత్రుడే. 'అంతులేని కథ', 'ముత్యాల పల్లకి', 'అంగడి బొమ్మ', 'చిలకమ్మ చెప్పింది', 'గ్యాంగ్ లీడర్', హిట్లర్ వంటి సినిమాల్లో నటించారు. దేవాంతకుడు, ఇంటికో రుద్రమ్మ, యముడికి మొగుడు, పెళ్ళి నీకు శుభం నాకు సినిమాలను నిర్మించారు. నారాయణరావు మృతిపై మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) సంతాపం తెలిపింది. నారాయణరావుకు ఒక కుమారుడు, కుమార్తె. ప్రస్తుతం ఇద్దరూ విదేశాల్లో ఉంటున్నారు. కృష్ణాజిల్లా కురుమద్దాలి గ్రామంలో జన్మించిన నారాయణ రావు బాల్యం, విద్యాభ్యాసం గుంతకల్లులో సాగింది. గిడుగు విశాలాక్షి వద్ద భరతనాట్యం, నటరాజ రామకృష్ణ వద్ద కూచిపూడి నృత్యం, ఎ.ఆర్.కృష్ణ వద్ద నటన నేర్చుకున్నారు. చదువుకునే రోజులలో మహమ్మద్ బీన్ తుగ్లక్, ప్రతాపరుద్రీయం, మంచుతెర తదితర నాటకాలలో నటించారు. దివంగత సినిమా నటులు కోట శ్రీనివాసరావు, నూతన ప్రసాద్, దేవదాస్ కనకాల తదితరులు నారాయణరావుకు రంగస్థల మిత్రులు. సినిమాలతో పాటు పలు టి.వి.సీరియళ్లలోనూ నారాయణ రావు నటించారు.

-----------------

## రణబాలి రిలీజ్ అక్టోబర్16కు మార్పు




రౌడీ హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'రణబాలి' పై కీలక అప్డేట్ వచ్చింది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన సాంగ్, గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని క్రియేట్ చేశాయి. భారీ యాక్షన్, పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. ముందుగా ఈ సినిమాను సెప్టెంబర్ 11 ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే కొన్ని కారణాలతో విడుదలను వాయిదా వేశారు.తాజాగా 'రణబాలి' కొత్త రిలీజ్ డేట్‌ను చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్ 16న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ పవర్‌ఫుల్ లుక్‌తో కూడిన కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. పోస్టర్‌లో కనిపిస్తున్న ఇంటెన్స్ లుక్ సినిమాపై మరింత
ఆసక్తిని పెంచుతోంది. కొత్త రిలీజ్ డేట్ ప్రకారం దసరా సీజన్‌కు దగ్గరగా 'రణబాలి' ప్రేక్షకుల ముందుకు రానుంది. పండుగ సెలవులు, భారీ స్టార్ ఇమేజ్ ఉన్న హీరో సినిమా కావడంతో బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్‌పై మేకర్స్ భారీ ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఇదే తేదీకి సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'జైలర్ 2' కూడా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో ఆసక్తికరమైన బాక్సాఫీస్ క్లాష్‌కు తెరలేచింది. ఒకవైపు విజయ్ దేవరకొండకు తెలుగు రాష్ట్రాలతో పాటు నార్త్ ఇండియా, ఇతర భాషల్లోనూ మంచి మార్కెట్ ఉంది. మరోవైపు రజినీకాంత్‌కు దేశవ్యాప్తంగా భారీ ఫ్యాన్ బేస్ ఉండటంతో ఈ రెండు సినిమాల పోటీపై ఇప్పటి నుంచే చర్చ మొదలైంది.




# అల్లు అర్జున్‌కు అరుదైన గౌరవం

## ఫోర్బ్స్ మ్యాగజైన్ కవర్‌పై మెరిసిన హీరో

అగ్రకథానాయకుడు అల్లు అర్జున్ మరో ఘనత సాధించారు. ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ ఫోర్బ్స్ ఇండియా 'షోస్టాపర్స్ 2026' ప్రత్యేక సంచిక కవర్ పేజీపై ఆయన మెరిశారు. ఈ సందర్భంగా పరిశ్రమలో ప్రస్తుత పరిస్థితులు, సినిమాలో కథ ప్రాముఖ్యతను ఆయన వివరించారు. బాలీవుడ్, దక్షిణాది సినిమా లేదా మరే ఇతర ప్రాంతీయ సినిమా అయినా సరే.. బాక్సాఫీస్ వద్ద ఆదరణ పొందాలంటే కథే ప్రధానం. మంచి కంటెంట్ ఉంటే భాషతో సంబంధం లేకుండా హిట్ అవుతుంది. కొత్త కథను ప్రేక్షకులకు అందించడమే అన్నిటికంటే ముఖ్యం' అని అల్లు అర్జున్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. సినిమాల్లోని నటీనటుల స్టార్‌డమ్ కంటే కూడా సరైన కథే చిత్ర విజయాన్ని నిర్ణయిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. 2025 జనవరి నుంచి 2026 మార్చి వరకు సినిమాలు, ఓటీటీ, క్రీడలు, సంగీతం, టెలివిజన్.. ఇలా వివిధ రంగాల్లో ప్రభావం చూపిన 100 మంది తారల జాబితాను 'షోస్టాపర్స్' పేరుతో ఫోర్బ్స్ ఇండియా తాజాగా విడుదల చేసింది. ఈ లిస్ట్‌లో ఇండస్ట్రీకి చెందిన పలువురు నటీనటులు చోటు దక్కించుకున్నారు. అల్లు అర్జున్‌తో పాటు అమితాబ్ బచ్చన్, మోహన్ లాల్, రజనీకాంత్, రామ్ చరణ్, షారుక్ ఖాన్, ఆమిర్ ఖాన్, అక్షయ్ కుమార్, ఏఆర్ రెహమాన్, బాబీ దేవోల్, దుల్కర్ సల్మాన్, మాధవన్, రణ్‌వీర్ సింగ్, రిషబ్ శెట్టి, కల్యాణి ప్రియదర్శన్, కంగనా రనౌత్ ఇందులో ఉన్నారు.